ప్రజాశక్తి

మంగళవారం 21 ఫిబ్రవరి 2023

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

ఆగని విలీనం



పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న బాలబాలికలు

- ◆ 168 ప్రాథమిక పాఠశాలలు కనుమరుగు
- ◆ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికయ్యాక మ్యాపింగ్ ప్రారంభం
- ◆ వచ్చే విద్యా సంవత్సరం నాటికి మూత

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

వచ్చే విద్యా సంవత్సరం ఆరంభం నాటికి అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల్లో 168 ప్రాథమిక పాఠశాలలు కనుమరుగుకానున్నాయి. పది మంది విద్యార్థుల్లోపున్న ప్రాథమిక పాఠశాలల వివరాలను పంపించాలని విద్యాశాఖ నుంచి ఉత్తర్వులు రావడంతో రెండు జిల్లాల విద్యాశాఖాధికారులు ఆ వివరాలను కమిషనరేట్‌కు పంపారు. 168 పాఠశాలలను ఏయే పాఠశాలల్లో విలీనం చేయాలన్న ఆదేశాలేవీ పై నుంచి రాకపోవడంతో మ్యాపింగ్ ప్రక్రియ జిల్లాల్లో ప్రారంభంకాలేదు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలయ్యాక మ్యాపింగ్ ప్రారంభించే అవకాశముంది.

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో దాదాపు 330 ప్రాథమిక పాఠశాలల్లోని మూడు, నాలుగు, ఐదు తరగతులను కిలోమీటరు పరిధిలోని ఉన్నత పాఠశాలల్లో ప్రభుత్వం విలీనం చేసింది. తాజాగా ఒకటి, రెండు తరగతుల్లో పదిమందిలోపు విద్యార్థులున్న ప్రాథమిక పాఠశాలలను సమీప పాఠశాలల్లో విలీనం చేయడానికి రంగం సిద్ధంచేస్తోంది. పదిలోపు విద్యార్థులున్న 168 ప్రాథమిక పాఠశాలలను విలీనం పేరుతో తాళంవేసి, అందులోని ఉపాధ్యాయులను వేర్వేరు పాఠశాలలకు సర్దుబాటుచేయనుంది. విలీనంకాబోయే ప్రాథమిక పాఠశాలల్లో అనకాపల్లి జిల్లాలో 151, విశాఖపట్నం జిల్లాలో 17 పాఠశాలలున్నాయి. 168 ప్రాథమిక పాఠశాలలను కిలోమీటరు దూరంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడానికి విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. పాఠశాలల విలీనంపై జిల్లాకు చెందిన మంత్రులు బూడి ముత్యాలనాయుడు, గుడివాడ అమర్‌నాథ్ మౌనం వహిస్తున్నారు తప్ప అడ్డుకొనే ప్రయత్నం చేయడంలేదన్న విమర్శలున్నాయి. ఒకటి, రెండు తరగతులను ఇతర పాఠశాలల్లో విలీనం చేస్తే పేద పిల్లలు ప్రాథమిక విద్యకు దూరంకానున్నారు. రేషనలైజేషన్, పాఠశాలల విలీనానికి సంబంధించిన జిఒ 117, 128పై కోర్టు తుది తీర్పు ఇవ్వకముందే చాపకింద నీరులా ప్రభుత్వం చేయాల్సిన పనులన్నీ చకచకాచేసుకుపోతోంది. ఉపాధ్యాయుల వర్క్ అడ్జెస్ట్‌మెంట్ పేరుతో మిగతా 2లో..

గురువులు, రవిబాబులకు..

ఎమ్మెల్సీ యోగం

ఆనందంలో అభిమానులు - పలుచోట్ల సంబరాలు



గురువులు



రవిబాబు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ దక్షిణ నియోజకవర్గంలోని మత్స్యకార సామాజిక తరగతికి చెందిన కోలా గురువులుకు, ప్రస్తుతం ఎస్‌టి కమిషన్ ఛైర్మన్‌గా ఉన్న డాక్టర్ కుంభా రవిబాబుకు ఎమ్మెల్సీ హోదా దక్కినట్లుగా చెప్పొచ్చు. దీంతో వారి అభిమానుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. సంబరాలు చేసుకుంటున్నారు. రెండు పర్యాయాలు రెండు పార్టీల తరపున దక్షిణ నియోజకవర్గం నుంచి శాసనసభకు పోటీ చేసిన గురువులు ఆ రెండు సార్లూ స్వల్ప తేడాతో ఓటమి చెంది ఎమ్మెల్యే పదవిని అందుకోలేకపోయారు. అయితే రానున్న మార్చిలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలలో ఎమ్మెల్యేల ద్వారా ఎన్నిక కాబడే ఏడు ఎమ్మెల్సీ స్థానాలలో ఒక దాన్నుంచి వైసిపి అధికార అభ్యర్థిగా గురువులు పేరును ఆ పార్టీ ప్రకటించింది. అసెంబ్లీలో మిగతా 2లో..

రియల్టర్ కిడ్నాప్ కేసు ఛేదన

కిడ్నాపర్లలో ఇద్దరు పోలీసులు, ఒక రౌడీషీటర్

వార్త 3లో..

భూకబ్జాదారులకు సిఐ కొమ్ముకాయడం దారుణం

ప్రజాశక్తి- కలెక్టరేట్ : భూకబ్జాదారులకు పద్మనాభం సిఐ సన్యాసినాయుడు కొమ్ముగాస్తూ తమపై తప్పుడు కేసు నమోదు చేసి, అరెస్టు చేయాలని చూస్తున్నారని మద్ది గ్రామానికి చెందిన కనకల సన్యాసమ్మ, ఆమె కుమారుడు శ్రీను, మనుమడు శేఖర్, అల్లుడు బుగత వెంకటరావు ఆరోపించారు. సోమవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ, మద్ది గ్రామంలో సర్వేనెంబర్ '224/ఎ'లో కనకల సన్యాసమ్మ పేరిట రూ.కోటి విలువైన 19 సెంట్లు స్థలం ఉందన్నారు కోర్టు వివాదాల నేపథ్యంలో తమకు అనుకూలంగా ఇంజక్షన్ ఇవ్వడంతోపాటు తమ అధీనంలో ఉన్న ఈ భూమిని బుగత సూర్యనారాయణ అనే వ్యక్తి అమ్మగా, కోర్టు వివాదంలో ఉందని తెలిసినా కొనుగోలు చేసిన ఎన్ని అప్పారావు దౌర్జన్యంగా భూమిలో ప్రవేశించడంతోపాటు పక్కా నిర్మాణాలు చేస్తుంటే తాము అడ్డుకున్నామన్నారు. దీంతో తమపై దౌర్జన్యం చేయగా, పూర్తి ఆధారాలతో పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. తామిచ్చిన ఫిర్యాదుకు రశీదు ఇవ్వక, చర్యలకు స్పందించని సిఐ సన్యాసినాయుడు, ఇదేమిటని ప్రశ్నిస్తే తిరిగి తమపైనే కేసు నమోదుకు సిద్ధపడ్డారని ఆరోపించారు. దీనిపై తాము హైకోర్టును ఆశ్రయిస్తే, 41 నోటీసు ఇవ్వకుండా, అరెస్టు చేయవద్దని కోర్టు ఆదేశించిందని, ఆ ఉత్తర్వులు సిఐకి చేరాయన్నారు. బాధితులైన తమకు న్యాయం చేయాల్సిన సిఐ, కబ్జాదారులతో చేతులు కలిపి అక్రమాలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సిఐతోపాటు భూకబ్జాదారులపై చర్యలు చేపట్టి, తమకు న్యాయం చేయాలని కలెక్టర్, సిపి ఫిర్యాదు చేస్తున్నామన్నారు.

శ్రీను వద్ద ఆధారాల్లేవు : సిఐ

పద్మనాభం : భూవివాదంపై రెండుసార్లు పోలీసులకు ఫిర్యాదు చేసిన కనకల శ్రీను వద్ద భూమికి సంబంధించి ఎటువంటి ఆధారాల్లేవి సిఐ సన్యాసినాయుడు తెలిపారు. ఇదే భూమికి సంబంధించి ఎన్ని అప్పారావు, చుక్కా ఈశ్వరమ్మలకు రెవెన్యూ అధికారులు ఇచ్చిన టైటిల్ డీడ్, 1బీ, పట్టాదారు పాసుపుస్తకాలున్నాయన్నారు. సంబంధం లేకపోయినా ఫిర్యాదుచేసిన శ్రీనుకు నిబంధనల ప్రకారం రెండుసార్లు రశీదులిచ్చామన్నారు. ఎన్ని అప్పారావు, చుక్కా ఈశ్వరమ్మ అనుభవంలో ఉన్న భూమిలో ఫిర్యాదుదారు కావాలనే దౌర్జన్యం చేస్తున్నారని సిఐ ప్రకటనలో తెలిపారు.

ఒక నామినేషన్ దాఖలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికకు సంబంధించి సోమవారం ఒక అభ్యర్థి జిల్లా సహాయ ఎన్నికల అధికారి ఎస్.శ్రీనివాసమూర్తికి తమ నామినేషన్ పత్రాలు అందజేశారు. విశాఖ నగరంలోని అల్లిపురం ఏరియాకు చెందిన కోడి శ్రీనివాసరావు స్వతంత్ర అభ్యర్థిగా ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలకు సంబంధించి ఈ నెల 16న నోటిఫికేషన్ రాగా సోమవారానికి ముగ్గురు అభ్యర్థులు ఆరు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు.

చెస్ జట్లు ఎంపిక

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ : ఆల్ విశాఖ చెస్ అసోసియేషన్, సృజన స్కూల్ సంయుక్తాధ్వర్యంలో అండర్-7, 17 ఓపెన్ అండ్ బాలికల చెస్ జట్లు ఎంపికలు ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి. 65 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్-7 బాలుర విభాగంలో సాయి శ్రియాస్, సౌరాజేష్, బాలికల విభాగంలో లాశ్రిత, పూజిత పట్నాలు, అండర్-17 బాలుర విభాగంలో ఆర్యన్ శిష్ట, కార్తికేయ, బాలికల విభాగంలో జాగృతి, సత్య శ్రీవిద్య ప్రథమ, ద్వితీయ స్థానాలను సాధించారు. వీరు త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని ఆల్ విశాఖ చెస్ అసోసియేషన్ సభ్యులు మణికంఠ, శ్రీకాంత్ తెలిపారు.

మొదటి పేజీ తరువాయి..

ఆగని విలీనం


రేషనలైజేషన్ జిఒను అనుసరించింది. పాఠశాలల విలీన మ్యాపింగ్‌పై ఎటువంటి ఉత్తర్వులూ రాలేదని అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి వెంకటలక్ష్మమ్మ 'ప్రజాశక్తి'కి తెలిపారు.

మూతపడనున్న పాఠశాలలు

అనకాపల్లి జిల్లాలో : అనకాపల్లి మండలంలో 7, అచ్యుతాపురంలో 9, బుచ్చెయ్యపేటలో 2, చీడికాడలో 10, చోడవరంలో ఒకటి, దేవరాపల్లిలో 12, గొలుగొండలో 6, కశింకోటలో 8, కె.కోటపాడులో 13, కోటవురట్లలో 8, మాకవరపాలెంలో 7, మునగపాకలో 7, నక్కపల్లిలో 4, నర్సీపట్నంలో 2, నాతవరంలో 6, పరవాడలో 10, పాయకరావుపేటలో 1, రాంబిల్లిలో 4, రావికమతంలో 4, రోలుగుంటలో 8, సబ్బవరంలో 8, ఎస్.రాయవరంలో 9, వి.మాడుగులలో 1, యలమంచిలిలో 4 ప్రాథమిక పాఠశాలలు మూతపడేవాటిలో ఉన్నాయి.

విశాఖపట్నం జిల్లాలో : ఆనందపురం మండలంలో 11, భీమునిపట్నంలో 1, గాజువాకలో 1, పద్మనాభంలో 1, పెదగంట్యాడలో 2, విశాఖపట్నం అర్బన్‌లో ఒక ప్రాథమిక పాఠశాల మూతపడేవాటిలో ఉన్నాయి.

విలీన చర్యలు ఉపసంహరించుకోవాలి



పేద విద్యార్థులను విద్యకు దూరంచేసే ప్రాథమిక పాఠశాలల విలీన చర్యలను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి. రేషనలైజేషన్, పాఠశాలల విలీన జిఒలు 117, 128పై హైకోర్టులో కేసు నడుస్తోంది. వీటిపై తుది తీర్పు రాకముందే అనధికారికంగా రేషనలైజేషన్, విలీనం చేయడం సమంజసంకాదు. వర్క్ అడ్జెస్టమెంట్‌లు పనిచేస్తున్న మండలంలోగానీ, పక్క మండలంలోని పాఠశాలలోగానీ సర్దుబాటు చేయాలి. కానీ 117, 128 జిఒల ప్రకారం సుదూర ప్రాంతాలకు ఉపాధ్యాయులను ప్రభుత్వం సర్దుబాటు చేసింది.

జి.చినబ్బాయ్, యుటిఎఫ్ అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి

గురువులు, రవిబాబులకు ఎమ్మెల్సీ యోగం

ఉన్న బలాబలాలను బట్టి చూస్తే మొత్తం ఈ ఏడింటినీ అధికార వైసిపి కైవసం చేసుకునే పరిస్థితి ఉంది. దీనిని బట్టి చూస్తే కోలా గురువులు కూడా ఎమ్మెల్సీ కాబోతున్నారని చెప్పవచ్చు. ఇక కోలా గురువులకు వైసిపిలో ప్రాధాన్యత ఉండటానికి కారణం ఆ పార్టీ పట్ల ఆయనకు ఉన్న నిబద్ధత ఓ ప్రధాన అంశమని చెప్పొచ్చు. దక్షిణ నియోజకవర్గ పరిధిలోని పేయందొర పేటలో నివసిస్తున్న గురువులు 2009లో రాజకీయాలలో ప్రవేశించారు. అప్పట్లో జరిగిన ఎన్నికల్లో ఆయన ప్రజారాజ్యం పార్టీ తరపున శాసనసభకు పోటీ చేశారు. అప్పట్లో కాంగ్రెస్ అభ్యర్థి ద్రోణంరాజు శ్రీనివాసరావు చేతిలో 341 ఓట్ల స్వల్ప తేడాతో పరాజయం పొందారు. ఆ ఎన్నికల్లో ద్రోణంరాజు శ్రీనివాసరావుకు 45971 ఓట్లు లభించగా, కోలా గురువులకు 45630 ఓట్లు లభించాయి. అప్పుడు టిడిపి అభ్యర్థిగా పోటీ చేసిన వాసుపల్లి గణేష్ కుమార్‌కు 24208 ఓట్లు మాత్రమే లభించాయి. కాగా, 2011లో జగన్మోహన్ రెడ్డి వైసిపిని స్థాపించారు. కోలా గురువులు ఆ పార్టీలో చేరారు. 2014 ఎన్నికల్లో వైసిపి అభ్యర్థిగా దక్షిణ నియోజకవర్గం నుంచి గురువులు పోటీ చేశారు. టిడిపి అభ్యర్థిగా వాసుపల్లి గణేష్ కుమార్ పోటీ చేయగా ఆయన విజయం సాధించారు. గణేష్ కుమార్‌కు 66566 ఓట్లు లభించగా, గురువులకు 48244 ఓట్లు వచ్చాయి. 18322 కోట్ల తేడాతో గురువులు ఓడిపోయారు. అప్పట్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన సిట్టింగ్ ఎమ్మెల్యే ద్రోణంరాజు శ్రీనివాసరావుకు కేవలం 8247 ఓట్లు వచ్చి డిపాజిట్ కోల్పోయారు. దరిమెల మారిన రాజకీయాలతో 2019లో ద్రోణంరాజు శ్రీనివాసరావు ఎన్నికలకు ముందు వైసిపిలో చేరటం, ఆయనకు పార్టీ టిక్కెట్టు దక్కడంతో పోటీకి దిగారు. ఆ ఎన్నికల్లో ఆయన ఓటమి చెందారు. వాసుపల్లి గణేష్ కుమార్ టిడిపి అభ్యర్థిగా పోటీ చేసి మరోసారి ఎన్నికయ్యారు. అయితే 2019 ఎన్నికల్లో వైసిపి తరపున మరోసారి పోటీ చేసేందుకు కోలా గురువులు సిద్ధపడ్డారు. జగన్మోహన్ రెడ్డి బుజ్జగించడంతో గురువులు వెనక్కి తగ్గి వైసిపి అభ్యర్థి విజయానికి పాటుపడ్డారు. వైసిపి పట్ల అంకితభావం ప్రదర్శించిన గురువులకు ఆ పార్టీ ప్రభుత్వం వచ్చిన నేపథ్యంలో రెండేళ్ల క్రితం ఫిషరీస్ కార్పొరేషన్ ఛైర్మన్ పదవి ఇచ్చారు. ఈ పదవితో గురువులు సంతృప్తి చెందారు. టిడిపి తరపున ఎమ్మెల్యేగా నెగ్గిన గణేష్ కుమార్ పార్టీ ఫిరాయించి వైసిపిలో చేరారు. అయినప్పటికీ గురువులు ఏమాత్రమూ మనస్థాపం చెందకుండా గణేష్ కుమార్‌తో కలిసి పని చేస్తూ వచ్చారు. ఎమ్మెల్యే టికెట్ ఇవ్వకపోయినా, గణేష్ కుమార్‌తో కలిసి గురువులు పనిచేస్తూ పార్టీకి విధేయుడుగా ఉన్న నేపథ్యంలో ఆయన అంకిత భావాన్ని గుర్తించి ఇప్పుడు ఎమ్మెల్సీ పదవిని ఆయనకు పార్టీ అప్పగించే నిర్ణయం చేసింది. దీంతో నియోజకవర్గంలోని గురువులు అభిమానులు, సామాజిక తరగతికి చెందిన వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గవర్నర్ కోటలో ఎమ్మెల్సీగా రవిబాబు

రాష్ట్ర ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ డాక్టర్ కుంభా రవిబాబు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నియమితులుకానున్నారు. ఆయన కాంగ్రెస్ ద్వారా రాజకీయాల్లోకి వచ్చి 2004లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ తరపున పోటీ చేసి తన సమీప ప్రత్యర్థి టిడిపి అభ్యర్థి శోభా హైమావతిపై గెలిచి తొలిసారి ఎమ్మెల్యేగా అసెంబ్లీకి ఎన్నికయ్యారు. 2014లో అసెంబ్లీ ఎన్నికలకు ముందు టిడిపిలో చేరి పార్టీ టికెట్ ఆశించారు. టికెట్ దక్కకపోవడంతో ఆయన అరకులోయ నియోజకవర్గం నుంచి టీడీపీ రెబెల్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. అనంతరం 2018లో వైసిపిలో చేరారు. అనంతరం ఎస్‌టి కమిషన్ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. తాజాగా ఆయన్ని ఎమ్మెల్సీ పదవి వరించనుండటంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ట్రైకార్ ఛైర్మన్ శతక బుల్లి బాబు సహా పలువురు సోమవారం పాడేరు అంబేద్కర్ జంక్షన్ వద్ద సంబరాలు జరుపుకున్నారు.

జానకిరామ్‌కు ఎమ్మెల్సీ సీటు కేటాయించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఉత్తరాంధ్రలో వాడబలిజ మత్స్యకార సామాజిక తరగతికి చెందిన వాసుపల్లి జానకిరామ్‌కు వైసిపి ప్రభుత్వం శాసన మండలి సభ్యునిగా అవకాశం కల్పించాలని తీర ప్రాంత వాడ బలిజ మత్స్యకారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు మూగి శ్రీరామ్మూర్తి డిమాండ్ చేశారు. సోమవారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎపిలోని మత్స్యకారుల జనాభాలో 70 శాతం వరకూ వాడబలిజ సామాజిక తరగతి వారు ఉన్నారని చెప్పారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి నేటి వరకూ శాసనమండలిలో వారికి ప్రాధాన్యత కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత వరకూ తమకు ఎంత అన్యాయం జరిగిందో వివరించారు. ఇప్పటికైనా తమ సామాజిక తరగతికి న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి గండుపిల్లి రామకృష్ణ, కోశాధికారి పేర్ల భాస్కర్ పాల్గొన్నారు.

ఆదాయం ఘనం.. సౌకర్యాలు మృగ్యం...

- మార్కెట్ కమిటీ మిగులు రూ.7.09 కోట్లు
- శిథిల భవనంలోనే విధులు
- కొత్త భవన నిర్మాణం ఎప్పటికి పూర్తయ్యేనో?

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆదాయం ఏటా గణనీయంగా పెరుగుతోంది. సౌకర్యాలు మాత్రం మృగ్యమనే చెప్పాలి. శిథిలావస్థకు చేరిన భవనంలోనే బిక్కు బిక్కుమంటూ ఉద్యోగులు, సిబ్బంది విధులు నిర్వహిస్తూ ఉన్నారు. 1976 నవంబర్ 20న వ్యవసాయ మార్కెట్ కమిటీ ఇక్కడ ఆవిర్భవించింది. 1997 మార్చి 2న వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ భవనాన్ని అప్పటి మార్కెటింగ్, వెనుక బడిన తరగతుల శాఖా మంత్రి ఎ.ఎల్లారెడ్డి ప్రారంభించారు. అప్పటి నుంచి ఉన్న భవనం నేడు శిథిలావస్థకు చేరింది.

కొత్త భవన నిర్మాణం ఎప్పటికి పూర్తయ్యే నో?

2021 డిసెంబర్ 21న స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు శిథిల భవనం ఆవరణలోనే రూ.50 లక్షలతో కొత్త భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.



పునాదుల స్థాయిలోనే మార్కెట్ కమిటీ కార్యాలయ భవనం

కాంట్రాక్టర్ ముందుకు రాకపోవడంతో భవన నిర్మాణంలో తీవ్ర జాప్యం నెలకొంది. 2022 ఏప్రిల్ 8న మరలా ఇదే భవన నిర్మాణానికి ఎఎంసి ఛైర్మన్ శంకుస్థాపన చేశారు. అయినప్పటికీ భవన నిర్మాణం పునాదుల స్థాయిలోనే ఉంది. వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం కొత్త భవనం ఇప్పటికైనా త్వరగా పూర్తి చేయాలని సంబంధిత ఉద్యోగులు కోరుతున్నారు.

ఏటా పెరుగుతున్న ఆదాయం..

వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆదాయం ఏటా గణనీయంగా పెరుగుతోంది. ఏటా ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి మార్చి వరకు నిర్దేశించిన ఆదాయం లక్ష్యం, వసూలు పరిశీలిస్తే... 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.3 కోట్ల 38 లక్షలు లక్ష్యం కాగా, ఇప్పటి వరకు రూ.4 కోట్ల 11లక్షలు వసూలైంది. ఇంకా మార్చి నెల రానే లేదు. ఆదాయం రాబట్టడంలో మార్కెట్ కమిటీ ఇప్పటికే లక్ష్యాన్ని దాటింది. 2021-22లో లక్ష్యం రూ.2 కోట్ల 60 లక్షలు కాగా, రూ.2 కోట్ల 81 లక్షలు వసూలైంది. ఇప్పటి వరకు మార్కెట్ కమిటీ ఆదాయం మిగులు రూ.7 కోట్ల 9 లక్షలు ఉంది.

శిథిలావస్థలో ఉన్న మార్కెట్ కమిటీ కార్యాలయ భవనం



ఇవీ ఆదాయ వనరులు

ఆనందపురం మండలం గంభీరం వద్ద ఉన్న చెక్ పోస్టు ద్వారా మొక్కజొన్న, ధాన్యం, ఉల్లి, పత్తి ఎగుమతులు సందర్భంగా ఆదాయం వస్తుంది. డివిజన్ పరిధిలో ఉన్న ఏడేసి చొప్పున రొయ్యల పరిశ్రమలు, రైస్ మిల్లులు, పది ప్లే ఉడ్ పరిశ్రమలు ద్వారా ఆదాయం వస్తోంది.

నేరాలు ఘోరాలు

సముద్రంలో మునిగి యువకుడు మృతి

ప్రజాశక్తి -నక్కపల్లి :మండలంలోని రాజయ్యపేట పంచాయతీ శివారు బోయపాడు సముద్రతీరంలో మహాశివరాత్రి పురస్కరించుకొని సముద్ర స్నానానికి వెళ్లిన యువకుడు సముద్రంలో మునిగిపోయి మృతి చెందాడు. మండలంలోని ఎన్.నరసాపురం గ్రామానికి చెందిన పోతంశెట్టి చక్రియ్య (21) సోమవారం ఉదయం తన స్నేహితులతో కలిసి సముద్ర స్నానానికి వెళ్ళాడు. బోయపాడు సముద్ర తీరంలో స్నానం చేస్తుండగా అలల తాకిడికి ప్రమాదవశాత్తు మునిగి పోయాడు. ఆ యువకుడును పలువురు రక్షించే ప్రయత్నం చేశారు. కొన ఊపిరితో ఉండగా బయటకు తీసి నక్కపల్లి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. మృతి చెందిన యువకుడు డిగ్రీ చదువుకున్నాడు. కుమారుడు మృతితో అతని తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు బోరున విలపించారు. గ్రామంలో విషాద చాయిలు అలముకున్నాయి.

పెద్దేరులో గుర్తు తెలియని మృతదేహం

ప్రజాశక్తి -వడ్డాది : బుచ్చయ్యపేట మండలం విజయరామరాజుపేట గ్రామం శివారులో ఉన్న పెద్దేరు నదిలో ఒక గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. బుచ్చయ్యపేట పోలీసుల కథనం ప్రకారం... పెద్దేరులో మహిళ మృతదేహాన్ని చూసి విఆర్ఓ ఎద్దు నాగరాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి మృతదేహాన్ని బయటకు తీసి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి వయస్సు 50 నుండి 60 సంవత్సరాల మధ్య ఉంటుంది. గోధుమ రంగు చీర, బిస్కెట్ రంగు జాకెట్టు ధరించి ఉంది. ఎవరికైనా ఈ వ్యక్తి వివరాలు తెలిస్తే బుచ్చయ్యపేట ఎస్ఐ సెల్ నెంబర్ 9440904211, పోలీస్ స్టేషన్ ఫోన్ నెంబర్ 9440906456కు తెలియజేయాలని కోరారు. బుచ్చయ్యపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నలుగురు జూదరుల అరెస్టు

ప్రజాశక్తి-గొలుగొండ:చిన్నయ్యపాలెం గ్రామంలో జానికిలమ్మ జాతర సందర్భంగా కోడిపందాలు ఆడుతున్న నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి పది కోడి పుంజులు స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడిలో నర్సీపట్నం రూరల్ సిఐ రమణయ్య, ఎస్సైలు నారాయణరావు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

సిఎస్ డిటి, విఆర్ఒ సస్పెన్షన్

ప్రజాశక్తి-పద్మనాభం : అనంతవరంలోని రైస్ మిల్లులోని నిల్వలలో చేతి వాటం చూపించారని రుజువు కావడంతో సిఎస్ డీటీ కె.శ్యామల, మద్ది విఆర్ఒ టిఎస్ఎన్ ఉమామహేశ్వరరావును జిల్లా కలెక్టర్ మల్లికార్జున సోమవారం సస్పెండ్ చేస్తూ ఉత్తుర్వులు జారీ చేసినట్లు పద్మనాభం డిప్యూటీ తహశీల్దార్ కిషోర్ తెలిపారు.

రియల్టర్ కిడ్నాప్ కేసు ఛేదన

కిడ్నాపర్లలో ఇద్దరు పోలీసులు, ఒక రౌడీషీటర్



కిడ్నాప్ కేసు వివరాలు వెల్లడిస్తున్న సిపి శ్రీకాంత్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : డబ్బుల కోసం ఎంతకైనా తెగిస్తామనే జాబితాలో ఇద్దరు కానిస్టేబుళ్లు చేరిపోయారు. రౌడీషీటర్‌తో కలిసి ఓ బిల్డర్‌ని కిడ్నాప్ చేసి డబ్బు గుంజిన కేసులో అడ్డంగా వారు దొరికిపోయారు. బాధితుని ఫిర్యాదు మేరకు విశాఖలోని పిఎం.పాలెం పోలీసులు రంగంలోకి దిగగా ఈ విషయం బయటపడింది. కేసు వివరాలను సిపి సిహెచ్.శ్రీకాంత్ సోమవారం మీడియాకు వెల్లడించారు. భీమిలి ప్రాంతానికి చెందిన వెంకట హేమంత్ రౌడీ షీటర్. మధుసూదన్ అనే రియల్టర్‌ను మోసం చేసేందుకు పన్నాగం పన్నాడు. తన ఫ్లాట్ అమ్ముతానని చెప్పడంతో రూ.30 లక్షల కమిషన్ ఇస్తే తాను అమ్మిస్తానని నమ్మబలికి ఆ తర్వాత కారులో దూరంగా తీసుకు వెళ్ళి హేమంత్ అండ్ కో మధుసూదన్‌ను కిడ్నాప్ చేశారు. డబ్బులిస్తేనే విడిచి పెడతానని హెచ్చరించారు. భయపడిన బాధితుడు తన ఖాతాలో ఉన్న రూ.7.5 లక్షల నగదును వీరి ఖాతాకు బదిలీ చేశాడు. అక్కడితో ఆగక మధుసూదన్ వద్ద ఉన్న బంగారం, ఫోన్ కూడా తీసుకుని పరారయ్యారు. బాధితుని ఫిర్యాదు మేరకు పోలీసులు తొలుత ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారిచ్చిన సమాచారం మేరకు హైదరాబాద్‌లో దాక్కున్న హేమంత్ బృందాన్ని పట్టుకున్నారు. అరెస్టయిన వారిలో అప్పలరాజు, రాంబాబు అనే ఇద్దరు కానిస్టేబుళ్లున్నారు. ఈ ఇద్దరూ అల్లూరి జిల్లాలో గంజాయి స్మగ్లింగ్ కేసులో గతంలోనూ అరెస్టయ్యారు. హేమంత్ డబ్బు కోసమే ఈ కిడ్నాప్‌నకు పన్నాగం పన్నాడని, అందుకు కానిస్టేబుళ్ల సహాయం కోరాడని సిపి తెలిపారు. ఆయనపై త్వరలో పీడీ యాక్ట్ పెట్టే ఆలోచన ఉన్నట్లు చెప్పారు.

బడ్డీల తొలగింపు

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 10వ వార్డు పరిధి తోటగరువు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను ఆనుకొని ఉన్న బడ్డీలను సచివాలయం టౌన్‌ప్లానింగ్ సిబ్బంది సోమవారం తొలగించారు. గత కొన్నేళ్లుగా తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రక్షణ గోడను ఆనుకొని కొంతమంది అనధికారికంగా బడ్డీలు, చిరు దుకాణాలు ఏర్పాటుచేసుకొని వ్యాపారాలు సాగిస్తున్నారు. పాఠశాల విద్యార్థుల రాకపోకలకు ఇబ్బందిగా మారడం, ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతున్న కారణంగా జివిఎంసి టౌన్‌ప్లానింగ్ అధికారుల ఆదేశాల మేరకు సచివాలయ సిబ్బంది అక్కడకు చేరుకొని జెసిబి సహాయంతో బడ్డీలను తొలగించారు. కొన్ని రోజుల ముందే బడ్డీల యజమానులకు సచివాలయం సిబ్బంది నోటీసులు ఇచ్చారు. కొంత మంది స్వచ్ఛందంగా దుకాణాలను తొలగించారు. మిగిలిన బడ్డీలను సోమవారం తొలగించారు.

డిగ్రీ కళాశాలలో 'ఓపెన్ డే'

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ఎస్‌విఎల్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం 'ఓపెన్ డే' కార్యక్రమం నిర్వహించారు. కళాశాలలో ఉన్న మౌలిక వసతులను, కోర్సులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.మంజుల, అధ్యాపకులు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు వివరించారు. ప్రయోగ శాలలను, గ్రంథాలయాన్ని, క్రీడా సముదాయాన్ని , మహిళా సాధికార విభాగం, ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్, జెకెసి ల్యాబ్ తదితర విభాగాలను విద్యార్థులు ఆసక్తిగా సందర్శించారు.

తారకరత్న మృతికి నివాళి

ప్రజాశక్తి -భీమునిపట్నం : నందమూరి తారకరత్న మృతి టిడిపికి తీరని లోటని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూక రాజు పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం సంస్మరణ సభ నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నూకరాజు మాట్లాడుతూ, టిడిపి క్రియాశీల రాజకీయాల్లో భాగస్వామి కావాలనుకున్న సమయంలో తారకరత్న మృతి అత్యంత బాధాకరమన్నారు. ఆయన మృతి పట్ల ప్రగాఢ సంతాపం, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో 3వ వార్డు కార్పొరేటర్ గంటా అప్పలకొండ, టిడిపి నాయకులు సిహెచ్ రమణ, కాసరపు నాగరాజు, ఎం.సంజీవకుమార్, వియ్యపు పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

తగరపువలస : జివిఎంసి ఒకటో వార్డు నాయకులు సోమవారం సాయంత్రం తగరపువలసలో తారకరత్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షులు టి.సూరిబాబు, తెలుగు యువత అధ్యక్షులు గోరే సదానంద, మాజీ కౌన్సిలర్ చిలకా నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.



తారకరత్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు



స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న ఎంపిపి రాంబాబు

స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని అనంతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు విద్యాకమిటీ సహాయంతో స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. పాఠశాల ప్రాంగణంలో సోమవారం ఏర్పాటుచేసిన ప్రత్యేక సమావేశానికి ఎంపిపి కె.రాంబాబు హాజరై విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉపాధ్యాయులు చెప్పిన పాఠ్యాంశాన్ని విద్యార్థులు శ్రద్ధగా విని అర్థం చేసుకోవాలన్నారు. ఈ ఏడాది శత శాతం ఉత్తీర్ణత సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జి.లక్ష్మి, హెచ్ఎం కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రకారాగారాన్ని సందర్శించిన సీనియర్ సివిల్ జడ్జి

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ కేంద్రకారాగారాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కెవి.బులికృష్ణ సోమవారం సందర్శించారు. బెయిలు మంజూరై, జామీను పెట్టుకోలేకపోయిన ఖైదీలతో ప్రత్యేకంగా మాట్లాడారు. షరతుల సడలింపునకు ప్రత్యేక దరఖాస్తు చేసుకోవాలని వారికి సూచించారు. న్యాయ సహాయం కావాల్సిన వారు తమకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ప్రతి ఖైదీతో మాట్లాడి సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఈ సందర్శనలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది రమణి, కాశీ, పారా లీగల్ వాలంటీర్ నూకరత్నం, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

స్పందనకు 5 అర్జీలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందనలో జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాముకు పలువురు వివిధ సమస్యలపై 5 అర్జీలు అందజేశారు. పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి 3, ఇంజినీరింగ్, యుసిడి విభాగాలకు ఒక్కొక్కటి చొప్పున వినతిపత్రాలు సమర్పించారు.



బెహరా భాస్కరరావుకు వినతిపత్రం అందిస్తున్న సంఘ సభ్యులు

రహదారి అభివృద్ధికి వినతి

ప్రజాశక్తి -గోపాలపట్నం : జివిఎంసి 92వ వార్డు పరిధి కంపరపాలెం నుంచి మేఘాద్రి గెడ్డ మీదుగా నరవ వెళ్లే రహదారిని అభివృద్ధి చేయాలని కోరుతూ ఆ ప్రాంతానికి చెందిన నవభారతి యువజన సేవా సంఘం ఆధ్వర్యాన జివిఎంసి కోఆప్షన్ సభ్యులు బెహరా భాస్కరరావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. సంబంధిత అధికారులతో మాట్లాడి రహదారి నిర్మాణానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు రామకృష్ణ, సభ్యులు కంచిపాటి మురళి, కంపర కోటీశ్వరరావు, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఎయును సందర్శించిన సంగీత దర్శకులు సాలూరి

ప్రజాశక్తి- విశాఖపట్నం : ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని ప్రముఖ సినీ సంగీత దర్శకులు సాలూరి వాసురావు సోమవారం సందర్శించారు. వీసీ ఆచార్య పివిజిడి ప్రసాద్‌రెడ్డితో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సాలూరి వాసురావును ఎయు విసి సత్కరించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం సంగీత విభాగాన్ని సందర్శించాలని ఆహ్వానించారు. ఎయులో అభివృద్ధి కార్యక్రమాలను వీసీ వివరించారు. ఈ సందర్భంగా వీసీ ప్రసాద్‌రెడ్డికి భగవద్గీత భావ చిత్ర సుధ పుస్తకాన్ని సాలూరి వాసురావు అందజేశారు.

టెన్త్ విద్యార్థులకు అల్పాహారం

ప్రజాశక్తి- ఆనందపురం: శ్రీ సత్య సాయి ఆదర్శ గ్రామం గొట్టిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల టెన్త్ విద్యార్థులకు సాయంత్రం వేళలో అల్పాహారాన్ని సోమవారం నుంచి ప్రారంభించారు. శ్రీ సత్యసాయి సేవా సంస్థలు, గొట్టిపల్లి భజన మండలి సభ్యులు, విశాఖకు చెందిన సాయి భక్తుడు పిఎస్ఎన్.మూర్తి సంయుక్తంగా టెన్త్ విద్యార్థులు 80 మందికి సాయంత్రం అదనపు తరగతులను పురస్కరించుకొని పౌష్టికాహారాన్ని పంపిణీ చేయనున్నారు. పాఠశాల హెచ్ఎం రుత్తల సన్యాసిరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సాయి భక్తుడు పిఎస్ఎన్ మూర్తి, శ్రీ సత్య సాయి ఆదర్శ గ్రామం కో-ఆర్డినేటర్ డబ్బీరు విజయ్‌కుమార్, కన్వీనర్, కో -కన్వీనర్లు కోరాడ తమ్మునాయుడు, డిపి రాజు, బాల వికాస్ కో-ఆర్డినేటర్ డబ్బీరు వెంకటసంతోష్ కిరణ్, వత్సవాయికృష్ణమూర్తిరాజు, సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా విజయదుర్గమ్మ వార్షికోత్సవం

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 9వ వార్డు పరిధి హనుమంతువాక సమీపంలోని విజయదుర్గ కాలనీలో గల విజయదుర్గ అమ్మవారి 21వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యాన సోమవారం అమ్మవారికి విశేష పూజలు జరిపారు. ఆలయం నుంచి సంజయ్‌గాంధీ కాలనీ పోలమాంబ ఆలయం వరకు 108 కళశాలతో ఊరేగింపుగా బయలుదేరి పోలమాంబ అమ్మవారికి పాలాభిషేకం చేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వేడుకలను ఆలయ కమిటీ నిర్వాహకులు ఎస్ఎస్ఎన్.రాజు, టిడిపి నాయకులు బుదుమూరు గోవిందు, జి.కిషోర్, తమ్మినాయుడు, నాని, సోమరాజు, ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

'ఉత్తరం'లో కెకె.రాజు గ్రీవెన్స్

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గంలో ప్రజల సమస్యలు పరిష్కరించే దిశగా వైసిపి సమన్వయకర్త కెకె.రాజు పార్టీ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గం నుంచి పలువురు కార్యాలయానికి విచ్చేసి సమస్యలతో కూడిన వినతులను కెకె.రాజుకు అందించారు. వినతులను పరిశీలించిన కెకె.రాజు అధికారులతో మాట్లాడి కొన్నింటి వెంటనే పరిష్కరించారు. మరికొన్నింటిని సంబంధిత అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలను వింటున్న కెకె.రాజు

ఎస్‌బిసి వంతెనపై వాహనాలను అనుమతించాలి

ప్రజాశక్తి -ములగాడ : డాక్ యార్డు బ్రిడ్జి బాగు చేసే వరకు ఎస్‌బిసి వంతెన మీదుగా వాహనాలను అనుమతించేలా తూర్పు నావికాదళ అధికారులతో ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు సంప్రదింపులు జరపాలని సిపిఎం మల్కాపురం జోన్ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సిపిఎం మల్కాపురం జోన్ కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం మల్కాపురం జోన్ కార్యదర్శి పి.పైడిరాజు మాట్లాడుతూ, 1968 నుంచి గాజువాక, సింధియా ప్రాంతాలకు చెందిన ప్రజలు విశాఖ నగరానికి, విశాఖ నగరం నుంచి పారిశ్రామిక ప్రాంతానికి వేల వాహనాలు, లక్షలాది మంది ప్రజలు సర్దార్ వల్లభాయ్ పటేల్ పోర్టర్ వంతెనపైనుంచే రాకపోకలు సాగిస్తున్నారని తెలిపారు. దీనిని డాక్‌యార్డు బ్రిడ్జి అని పిలుస్తున్నామని పేర్కొన్నారు. ఈ వంతెనను 15 నెలలు పాటు నిర్మాణం కోసం మూసివేస్తామని అధికారులు ప్రకటించారని, దీనివల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటారని తెలిపారు. ఈ వంతెన పనులు పూర్తయ్యేంతవరకు పక్కనే ఉన్న ఎస్‌బిసి బ్రిడ్జిపై నుంచి ప్రజా వాహనాల రాకపోకలు అనుమతించాలని తూర్పు నావికాదళ అధికారులకు విజ్ఞప్తిచేశారు. జివిఎంసి పరిధిలో గల 40, 58 నుంచి 63, 64 వార్డు యారాడలో రెండు లక్షల మంది నివసిస్తున్నారని, వారికి ఎమర్జెన్సీ వైద్యం కెజిహెచ్, ఇతర హాస్పిటళ్లకు వెళ్లేందుకు ఈ మార్గమే పెద్ద దిక్కుగా ఉందని వివరించారు. డాక్ యార్డ్, షిప్‌యార్డు హెచ్‌పిసిఎల్, ఐఒసి, కోరమండల్, పోర్ట్, గొడౌన్లలో వేలాది మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని చెప్పారు. ఈ బ్రిడ్జి మూసివేయడం వల్ల వారంతా సుమారు 6 కిలోమీటర్లు అదనముగా ప్రయాణం చేయాల్సి వస్తుందన్నారు. ఆ దారిలో మూడు రైల్వే క్రాసింగ్‌లు ఉన్నాయని, వందలాది భారీ వాహనాలు ఆ మార్గము ద్వారా వెళుతుండటంతో ట్రాఫిక్ రద్దీగా ఉంటుందని తెలిపారు. రక్షణరంగం అవసరం కోసం నిర్మించిన ఎస్‌బిసి బ్రిడ్జి పైనుంచి వాహనాలు రాకపోకలను అనుమతించాలని కోరారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు, స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు, మేయర్, కార్పొరేటర్లు స్పందించి నావికాదళ అధికారులతో సంప్రదింపులు జరిపి ప్రత్యేక ఏర్పాట్లుచేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. పోస్టర్ విడుదల కార్యక్రమంలో పార్టీ జోన్ నాయకులు కె.పెంటారావు, ఆర్.విమల, ఎ.సత్యారావు, నాయకులు కె.నూకరాజు, ఆర్.దేవరాజు, చిన్నబ్బాయి, దేవుడుబాబు తదితరులు పాల్గొన్నారు.

సేఫ్టీ పరికరాలకు పారిశుధ్య కార్మికుల ధర్నా

ప్రజాశక్తి -గాజువాక : రాత్రివేళలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు సేఫ్టీ పరికరాలు సరఫరా చేయాలని కోరుతూ గాజువాక జోనల్ కార్యాలయం వద్ద జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జోన్-6 గాజువాక కమిటీ గౌరవాధ్యక్షులు జి.సుబ్బారావు మాట్లాడుతూ, రాత్రి వేళలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు సేఫ్టీ పరికరాలు లేక తరచూ ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. జాతీయ రహదారిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు పలుచోట్ల లైటింగ్ సదుపాయం లేకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని పేర్కొన్నారు. రాత్రుళ్ళు జాతీయ రహదారులను హైవే చీపింగ్ చేసే మిషన్‌తో క్లీనింగ్ చేయించాలని, కార్మికులకు యాప్రిన్, రేడియం గౌన్లు ఇవ్వాలని, చీపుర్లు, పారలు, సేఫ్టీ పరికరాలు ఇవ్వాలని, తక్షణమే, డెత్, సిక్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి గొలగాని అప్పారావు, ప్రెసిడెంట్ గొల్ల రాము, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.గణేష్, వర్కింగ్ సెక్రెటరీ ఎన్.నాగరాజు, శ్రామిక మహిళా అధ్యక్షులు బి. మీనాక్షి, ప్యాకేజీ కమిటీ ప్రతినిధులు పద్మ, దివ్య, లక్ష్మి, నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న సుబ్బారావు

సానుకూల దృక్పథంతోనే ఉన్నత శిఖరాలు

ప్రజాశక్తి-సీతమ్మధార : సానుకూల దృక్పథంతోనే విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించగలరని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం అన్నారు. జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, ఎస్ఇఆర్‌టి, రాష్ట్ర విద్యాశాఖ సంయుక్తంగా పరీక్ష పర్వ్ 4.0 పేరిట పదోతరగతి విద్యార్థులకు మధురానగర్ మునిసిపల్ హైస్కూల్‌లో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గొండు సీతారాం మాట్లాడుతూ, పరీక్షలు, మార్కుల సాధన ఒక్కటే జీవితానికి దిక్సూచి కాదన్నారు. ఇష్టపడి, కష్టపడి రాణించే ఏ రంగాన్నైనా ఎంపికచేసుకోవచ్చని సూచించారు. ఆందోళన, దిగులు, భయంతో రాసే పరీక్షల్లో వచ్చే మార్కుల వల్ల ఎటువంటి ప్రయోజనం ఉండదని చెప్పారు. ప్రశాంత వాతావరణంలో, ఎటువంటి ఒత్తిడులకు లోనుకాకుండా రాసే పరీక్షలతోనే అద్భుతమైన జీవన గమ్యాలను చేరుకోగలమన్నారు. ఇటువంటి అవగాహనా కార్యక్రమాలు రాష్ట్ర వ్యాప్తంగా జరిగేలా రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్పర్సన్ కేసలి అప్పారావు సారథ్యంలో ప్రణాళికలను రూపొందిస్తోందని తెలిపారు. భీమునిపట్నం డైట్ కళాశాల ప్రిన్సిపల్ యు.మాణిక్యంనాయుడు మాట్లాడుతూ, విద్యార్థులు ఒత్తిడి, ఆందోళన, భ్రమలు విడనాడి ప్రశాంత వాతావరణం, సానుకూల దృక్పథంతో ముందుకు నడిస్తే ప్రశంసలతో కూడిన విద్యా పరంపర కొనసాగుతుందని చెప్పారు. చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం జిల్లా సైకాలజీ విభాగం కన్వీనర్ డాక్టర్ జగ్గారావు మాట్లాడుతూ, నిర్విరామ పుస్తక పఠనంతోనే మంచి మార్కులు సాధ్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో పరీక్ష పర్వ్ 4.0 కో-ఆర్డినేటర్ జె.మాధవి, స్కూల్స్ ఇన్‌స్పెక్టర్ స్వర్ణ కుమారి, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు శాంతి కుమారి, సిఆర్‌పిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బి.శకుంతల, ఫోరం ప్రతినిధులు లవ కుశ, ప్రవీణ త్రినాథ్, నజీమ, సచివాలయ కార్యదర్శులు వి.వేణు జ్యోతి దేవి, కరిష్మ పాల్గొన్నారు.

గీతం విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి-మధురవాడ : గీతంలోని ప్రాంగణ నియామకాలలో సైన్స్, ఫార్మసీ, మేనేజ్‌మెంట్ కోర్సులకు సంబంధించి 3 76 మంది గీతం విద్యార్థులకు అధిక వేతనంతో ప్రముఖ సంస్థలు అవకాశాలు కల్పించాయని గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ డైరెక్టర్ ఎస్.వంశీకిరణ్ సోమయాజుల తెలిపారు. స్కూల్ ఆఫ్ సైన్స్, స్కూల్ ఆఫ్ ఫార్మసీ ఆఖరి సంవత్సరం విద్యార్థులకు ఔషధ పరిశ్రమ హెటిరో డ్రగ్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఎరిజన్ లైఫ్ సైన్సెస్, విప్రో, నెక్స్ట్ టర్న్, మైక్రాన్, దీమెథ్ కంపెనీ, ఎడిపి, హెక్సావేర్, బెట్ పోల్, మై కెప్టెన్, ఎలుసి డేటా కంపెనీలు నిర్వహించిన ప్రాంగణ నియామకాలలో 220 మంది విద్యార్థులకు రూ.3 లక్షల నుంచి రూ.7.5 లక్షల వార్షిక వేతనం లభించిందని తెలిపారు. విద్యార్థులకు నమూనా ఇంటర్వ్యూలు, నిరంతర శిక్షణ ప్రాంగణ నియామకాలలో ఎంపిక కావడానికి ఉపయోగపడిందని కెరీర్ ఫుల్‌ఫిల్‌మెంట్ సీనియర్ మేనేజర్ ప్రభమహంతి తెలిపారు.

గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ విద్యార్థులకు నిర్వహించిన ప్రాంగణ నియామకాలలో 156 మందికి గ్రాసిమ్ పేయింట్స్, సేజ్‌ఫైర్, ఎమ్ఆర్ఎఫ్ టైర్స్, టిసిఐ లాజిస్టిక్స్, ఎవరెస్ట్ ఇండస్ట్రీస్, బజాజ్ అలయెంజ్, ఫిలిప్స్, విప్రో, హెచ్‌డిఎఫ్‌సి ఎస్సెట్ మేనేజ్‌మెంట్, బెర్కాడియా ఇండియా లిమిటెడ్ సంస్థలలో ఉద్యోగాలు లభించాయని గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ డైరెక్టర్ ఎస్.వంశీకిరణ్ సోమయాజుల తెలిపారు. ఎంబిఎ తదితర కోర్సుల ఆఖరి సంవత్సరం విద్యార్థులకు రూ.10.5 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలు లభించాయని పేర్కొన్నారు. గీతం మేనేజ్‌మెంట్ విద్యార్థులకు ప్రాంగణ నియామకాలను నిర్వహించడానికి ఫిన్‌టెక్ సంస్థలు ఆసక్తి కనబరిచాయని కెరీర్ ఫుల్‌ఫిల్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్ ఎ.వెంకటేష్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను గీతం వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ దయానంద సిద్ధవట్టం అభినందించారు.

20 నుంచి ప్రీ పిహెచ్‌డి పరీక్షలు

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్ర విశ్వవిద్యాలయం ట్రాన్స్ డిసిప్లినరీ రీసెర్చ్ హబ్‌లో ప్రవేశం పొందిన వారికి ఈ నెల 20వ తేదీ నుంచి ప్రీ పిహెచ్‌డి పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎయు టిడిఆర్ హబ్ డీన్ ఆచార్య ఎం.జేమ్స్‌స్టీఫెన్ తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలను సోమవారం ఏయూ విసి ఆచార్య పివిజిడి ప్రసాద్‌రెడ్డి ఆవిష్కరించారు. ప్రీ పిహెచ్‌డి పరీక్షకు ఈ నెల 28వ తేదీలోగా ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎయుటిడిఆర్ హబ్ వెబ్‌సైట్లో సంబంధిత వివరాల నమోదు చేసి నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ప్రీ పిహెచ్‌డి ప్రవేశ పరీక్ష రెండు పేపర్లుగా నిర్వహిస్తామని చెప్పారు. 50 శాతం మార్కులతో ఈ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుందన్నారు. ట్రాన్స్ డిసిప్లినరీ రీసెర్చ్ హబ్‌లో ప్రవేశం పొంది 18 నెలల కాలం పూర్తయిన వారు నేరుగా ప్రీ పిహెచ్‌డి పరీక్షకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. వివరాలకు ఎయు టిడిఆర్‌ను సంప్రదించాలని సూచించారు. 2022 మార్చి కంటే ముందుగా ఇంజినీరింగ్, ఫార్మసీ విభాగాల్లో పిహెచ్‌డిలో ప్రవేశం పొందిన వారు ప్రస్తుత నిర్వహిస్తున్న ప్రీ పిహెచ్‌డి పరీక్షలకు హాజరు కావాల్సిన అవసరం లేదని తెలిపారు. ప్రీ పిహెచ్‌డి పరీక్ష తేదీలు త్వరలో వెల్లడిస్తామన్నారు.

22, 23 తేదీలలో ఐఎన్‌టియుసి ప్లీనరీ

ప్రజాశక్తి -కంచరపాలెం : ఐఎన్‌టియుసి జాతీయ ప్లీనరీ సమావేశాలు ఈ నెల 22, 23 తేదీలలో న్యూఢిల్లీలో జరుగుతాయని ఏపీ అండ్ టిఎస్ స్టేట్ ఐఎన్‌టియుసి వైస్ ప్రెసిడెంట్ మేరపురెడ్డి కొండబాబు తెలిపారు. కంచరపాలెంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కార్మిక వర్గ సమస్యలపై ప్లీనరీ సమావేశాల్లో చర్చించనున్నట్లు తెలిపారు. ప్రధానంగా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంట్రాక్ట్ వ్యవస్థ రద్దుచేయాలని, స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ ఆపాలని, పోర్టు హాస్పటల్ బెర్తులు, కళ్యాణ మండపాల ప్రయివేటీకరణ ఆపాలని, కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో ఖాళీలు భర్తీ, పాత పెన్షన్ విధానం కొనసాగించాలన్న సమస్యలు చర్చకు వస్తాయన్నారు. ఈ సమావేశాల్లో పాల్గొనేందుకు విశాఖపట్నం పరిధిలోని ప్రభుత్వ, ప్రయివేటు రంగ సంస్థల్లోనూ పనిచేస్తున్న కార్మిక వర్గ ప్రతినిధులు గొర్లె చందు, ఎస్‌కె.రాజు, పివి.రమణ, కె.హేమంత్ తదితరులు ఢిల్లీకి బయలుదేరి వెళుతున్నట్లు కొండబాబు తెలిపారు.

ఆర్ఎఆర్ఎస్ కాంట్రాక్టు కార్మికుల సమ్మె

ఆప్కాస్‌లో కలపాలని, కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్

ప్రజాశక్తి -అనకాపల్లి

ఆచార్య ఎన్జీ రంగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ ఫర్ అవుట్ సోర్సింగ్ సర్వీసెస్ (ఆప్కాస్)లో కలపాలని, కనీస వేతనాలు అమలు చేయాలని కోరుతూ సోమవారం నుంచి కార్మికులు సమ్మెబాట పట్టారు. రాష్ట్రవ్యాప్త సమ్మెలో భాగంగా స్థానిక ఆర్ఎఆర్ఎస్ వద్ద కాంట్రాక్టు కార్మికులు యూనియన్ ఆధ్వర్యాన టెంటు వేసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకర్రావు, నాయకులు గంట శ్రీరామ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాలు అమలు చేయాలని, సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఈఎస్ఐ, పిఎఫ్ సమస్య పరిష్కరించాలని, కాంట్రాక్టు కార్మికులు మరణిస్తే నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై పలుమార్లు వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులకు వినతి పత్రాలు అందించినా పరిష్కారం కాలేదన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, చాలీచాలని జీతాలతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ గెజిట్ లేదా కార్మిక శాఖ ఇచ్చిన కనీస వేతనాల జీవో అమలు చేయాలన్నారు. ఇతర యూనివర్సిటీలో చెల్లిస్తున్న వేతనాల మాదిరిగా ఇక్కడ చెల్లించాలని కోరారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు నందీశ్వరరావు మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోరుతూ అనేకమార్లు వినతి పత్రాలు అందజేశామని, అయినా అధికారులు స్పందించకపోవడంతో సమ్మెబాట పట్టాల్సి వచ్చిందని తెలిపారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్ష కార్యదర్శులు నడుపూరు చంద్రశేఖర్, గెద్దం లక్ష్మణరావు, చందక మహాలక్ష్మి, ఎ.మంగ, కొణతాల సంతోష్, హేమ, సాయి తదితరులు పాల్గొన్నారు.



ఆర్ఎఆర్ఎస్ ఎదుట ధర్నా చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు



ప్రజల సమస్యలు వింటున్న కలెక్టర్, జెసి, డిఆర్ఒ

స్పందనకు 159 అర్జీలు

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలకు సంబంధించి 159 అర్జీలు అందాయి. వీటిని కలెక్టర్ రవి పఠాన్ శెట్టి, జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటరమణ స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దరఖాస్తుదారుడు కార్యాలయాల చుట్టూ తిరగకుండా స్పందనలో వచ్చే అర్జీలను సత్వరమే సంబంధిత అధికారులు పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా వికలాంగుల దగ్గరకు జిల్లా రెవెన్యూ అధికారి వెంకటరమణ వెళ్లి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.


ఎస్పీ కార్యాలయంలో.....

ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ గౌతమీ సాలి అర్జీదారుల నుంచి నేరుగా సమస్యలు తెలుసుకుని అర్జీలను స్వీకరించారు. చట్ట పరిధిలో సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించి అర్జీదారునికి ఉపశమనం కలిగించాలని కోరారు. ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు తదితర ఫిర్యాదులకు సంబంధించి 34 అర్జీలను స్వీకరించారు.

అన్న సమారాధన

ప్రజాశక్తి-అనకాపల్లి

స్థానిక విజయరామరాజుపేట అండర్ బ్రిడ్జి వద్ద ఉన్న శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 29వ ఆరాధన, మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని భారీ అన్న సమారాధన నిర్వహించారు. పట్టణ కామాక్షి కార్పెంటర్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం శాశ్వత గౌరవ అధ్యక్షులు కోసూరి మన్మధరావు, గౌరవ అధ్యక్షులు ఎండపల్లి మోహన్ బ్రహ్మజీ, అధ్యక్షులు వానపల్లి కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సింహాద్రి కోటేశ్వరరావు, కోశాధికారి మునాసన రామకష్ణ, పట్టణ కామాక్షి కార్పెంటర్స్ సంఘం సభ్యులు, పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్ చూపుతున్న విద్యార్థి, ఉపాధ్యాయులు

వాలీబాల్ పోటీల్లో తోటాడ విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి -మునగపాక రూరల్

మండలంలోని తోటాడ జిల్లా పరిషత్తు హైస్కూల్లో ఏడవ తరగతి చదువుతున్న అంగుళూరు లోకేష్ (13) అంతర్ జిల్లాల వాలీబాల్ పోటీలలో తన సత్తాను చాటుకున్నాడు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఈనెల 14 నుంచి 16 వరకు పలనాడు జిల్లా నరసరావుపేటలో జరిగిన 66వ అంతర్ జిల్లాల వాలీబాల్ పోటీల్లో ఉమ్మడి విశాఖ జిల్లాల నుంచి 12 మంది పాల్గొన్నారు. వీరు ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం హైస్కూల్లో ప్రధానోపాధ్యాయులు కుమార్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ సూరిశెట్టి భాస్కరరావులు లోకేషను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే చదువుతోపాటు క్రీడలపై మక్కువ చూపాలన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించి పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు తేవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌విడి పద్మావతి, సిహెచ్ఆర్ కృష్ణమూర్తి, ఫిజికల్ డైరెక్టర్ గండి గోవిందరావు, సిఆర్పి మద్దాల గోవింద, కాండ్రేగుల వెంకటరెడ్డి, వర్మ తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక మాలధారణ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రతి ఏటా కొత్త అమావాస్య జాతర సందర్భంగా నూకాంబిక ఆలయంలో అమ్మవారి మాల ధారణకు సంబంధించి పోస్టరును జిల్లా ఖోఖో సంఘం అధ్యక్షులు దాడి జైవీర్ సోమవారం ఆవిష్కరించారు. నూకాంబిక అమ్మవారి మాల ధారణ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పొలిమేర శ్రీను ఆధ్వర్యంలో ఆలయ కాలక్షేప మండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో జైవీర్ మాట్లాడుతూ ప్రతి ఏటా వందలాది మంది భక్తులు మాలధారణలో పాల్గొంటారని తెలిపారు. మండపంలో భూగోళం చుట్టూ శివపార్వతుల అష్టాదశ శక్తి పీఠములు ఏర్పాటు చేయడం హర్షణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కనకదుర్గమ్మ ఆలయ వ్యవస్థాపకులు పీవీ రమణ, సూరిశెట్టి ఉదయ్, సూరిశెట్టి శ్రీను, అక్షయ్, రాజు, సాయి, కృప సాగర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి- రాంబిల్లి : రాంబిల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 21 మంగళవారం ఉదయం 10 గంటలకు జరుగుతుందని ఎంపీడీవో కెవిఎస్ కొండలరావు తెలిపారు. మండల పరిషత్ అధ్యక్షురాలు గొల్లిముక్కల శిరీష అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండలంలోని గ్రామ సర్పంచులు, ఎంపిటిసిలు, మండల స్థాయి హాజరు కావాలని కోరారు.

న్యాయం జరిగే వరకూ పోరాటం

113వ రోజుకు నేవీ నిర్వాసితుల ఆందోళన



ఆందోళన చేస్తున్న నేవీ నిర్వాసితులు

ప్రజాశక్తి -రాంబిల్లి

తమకు న్యాయం జరిగే వరకు పోరాటాన్ని ఆపేది లేదని ఎన్ఎఒబి నిర్వాసిత జెఎసి నాయకులు స్పష్టం చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని వాడనర్సాపురం వద్ద నేవీ ప్రధాన గేట్ ముందు ఎన్ఎఒబి నిర్వాసితులు చేస్తున్న ఆందోళన సోమవారం నాటికి 113వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా నిర్వాసిత జెఎసి నాయకులు మాట్లాడుతూ నేవీ నిర్మాణంతో 8 గ్రామాల నిర్వాసితులు ఉపాధి కోల్పోయారని తెలిపారు. ఈ విషయం అందరికీ తెలిసినా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎవరికి ఎంత అన్యాయం జరిగిందో చూడకుండా, కొన్ని గ్రామాలను మాత్రమే గుర్తించి జీవన భృతి కల్పిస్తామని చెప్పడం తగదన్నారు. కొన్ని గ్రామాలను గుర్తించకుండా, వారిని ఇబ్బందులకు గురి చేయడంతో కొప్పుగొండపాలెం, వాడపాలెం, చిన్న కలవలపల్లి, కొత్తపేట, గోవింద పాలెం, నేవీ కాలనీ గ్రామాల ప్రజలు ఆందోళన చేపడుతున్నారని తెలిపారు. అందరినీ సమానంగా చూడవలసిన ప్రభుత్వాలు, ఒకరిని ఒకలాగా మరొకరిని మరోలాగా చూసి విభజించి పాలించు పద్ధతిలో వ్యవహరించడం దారుణమన్నారు. జిల్లా అధికారి యంత్రాంగం, ప్రభుత్వాలు తమ పట్ల వివక్ష చూపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో 8 గ్రామాల పెద్దలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున


ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

క్రీడలు ఆటగాళ్లలో క్రీడాస్ఫూర్తిని పెంపొందిస్తాయని, గెలుపు, ఓటమిలను అందరూ సమానంగా స్వీకరించాలని జిల్లా కలెక్టరు డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. సోమవారం ఉదయం స్థానిక వివిఎంఆర్‌డిఎ వుడా పార్కులోని స్కేటింగ్ రింగ్‌లో రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలను జ్యోతి ప్రజ్వలన చేసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విజయం సాధించాలని అన్నారు. ఈ పోటీల్లో 13 జిల్లాల నుంచి 472 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని తెలిపారు. 11, 14, 17, 19 సంవత్సరాలలోపు బాల బాలికలు పాల్గొంటు న్నారన్నారు. మూడు రోజులపాటు సాగే ఈ క్రీడలు ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తాయన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖాధికారి ఎల్.చంద్రకళ, సమగ్ర శిక్ష అభియాన్ అడిషనల్ ప్రాజెక్ట్ కో - ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ విశాఖ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ సిహెచ్.వెంకటరెడ్డి, పోటీల అబ్జర్వర్ సుధాకర్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎల్లయ్య కాలువ పూడిక తీయరూ..

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి పట్టణంలో ప్రధాన కాలువ అయిన ఎల్లయ్య కాలువ పూడిక తీయాలని స్థానికులు కోరుతున్నారు. ప్రస్తుతం ఈ కాలువ పూడిక, చెత్త చెదారంతో నిండి ఉంది. స్థానిక నాయుళ్ల వీధి నుంచి వేల్పుల వీధి వరకు ఉన్న ఈ కాలువ పూడిక పనులు గత కొన్నేళ్లుగా చేయకపోవడంతో తుప్పలు, మొక్కలు చెత్తతో నిండు ఉంది. దీంతో డ్రైనేజీ నిల్వ ఉండడంతో కాలువ నుంచి దుర్గంధం వ్యాపిస్తుంది. దీనివల్ల పట్టణ ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. కాలువలోనే పందులు, పాములు సంచరించడం, ఇళ్లల్లోకి ప్రవేశిస్తుండడంతో భయాందోళనలకు గురవుతున్నారు. దీంతో పాటు తరచూ వ్యాధుల బారిన పడుతున్నట్టు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా స్పందించలేదని, ఇప్పటికైనా కాలువ పూడిక పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఈ ఎల్లయ్య కాలువను అనుకొని గతంలో ఊళ్ల కాల్వ ఉండేది. 2012 సంవత్సరంలో అప్పటి జీవీఎంసీ అధికారులు కాల్వను ఆక్రమించి డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేశారు. దీంతో కాల్వ పూర్తిగా కూడుకుపోయి పారని పరిస్థితి ఏర్పడిందని స్థానికులు అంటున్నారు.



చెత్త పేరుకుపోయి మురుగునీరు నిల్వ ఉన్న ఎల్లయ్య కాలువ

భూ హక్కులు, చట్టాలపై అవగాహన అవసరం

జాతీయ సెమినార్‌లో వక్తలు

ప్రజాశక్తి-సబ్బవరం

భూమి హక్కులు, రికార్డులు, చట్టాలపై రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్, ఎస్‌ఆర్‌సి హైదరాబాద్ స్పాన్సర్‌తో స్థానిక దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ ఆధ్వర్యంలో భూమి, హక్కులు, రికార్డులు, చట్టాలు, పాలన, సవాళ్ల అనే అంశంపై రెండు రోజుల జాతీయ సెమినార్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.సూర్య ప్రకాష్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈస్టిండియా కంపెనీ స్వాధీనం చేసుకున్న దివానీ హక్కులు, టాక్స్ కలెక్షన్ హక్కుల నుండి భూచట్టం, దాని పరిణామం చరిత్ర ప్రారంభమైందని తెలిపారు. బ్రిటీషర్లు భూమి రెవెన్యూ వసూలు క్రమంలో అనేక చట్టాలను రూపొందించారని చెప్పారు. భారతదేశంలో నేటికీ 70శాతం కంటే ఎక్కువ మంది ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారని, చాలా ముఖ్యమైన ఇలాంటి అంశంపై సెమినార్‌ను ఏర్పాటు చేసిన ప్రొఫెసర్ కె.సుధ, బృందాన్ని అభినందించారు. ముఖ్య అతిథి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కెజి శంకర్, స్వతంత్ర న్యాయ పరిశోధకురాలు డాక్టర్ ఉషా రామనాథన్ కీలకోపన్యాసం చేశారు. నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా అడ్జంక్ట్ ప్రొఫెసర్ సునీల్ కుమార్ గ్రామీణ భూ యజమానులకు భరోసా కల్పించడానికి న్యాయవాదులు, న్యాయ విద్యార్థుల కర్తవ్యాన్ని నొక్కి చెప్పారు. అడిషనల్ చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ ఎఎండి ఇంతియాజ మాట్లాడుతూ 1800లో మొదటి సారి భూసర్వే నిర్వహించారని, ఆ తర్వాత 1910లో భారీ యంత్రాలతో ఎటువంటి సాంకేతిక పరిజ్ఞానం లేకుండా భౌతిక పద్ధతిలో రీసర్వే చేపట్టారని తెలిపారు. 100 సంవత్సరాల తర్వాత ఆంధ్ర ప్రదేశ్‌లో ఇప్పుడు రీసర్వే జరుగుతుందని, డ్రోన్లు, హై టెక్నాలజీని ఉపయోగించి 2023 డిసెంబర్ చివరి నాటికి దీనిని పూర్తి చేయాలనే లక్ష్యంతో చేపట్టారని చెప్పారు. భూ పరిపాలన వ్యవస్థలో సౌలభ్యాన్ని, భూ వివాదాలను పరిష్కరించడానికి ఈ సర్వే చాలా ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో లా వర్సిటీ ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.మధుసూదనరావు, డాక్టర్ కె.సుధ, పి.బయోలా కిరణ్ కన్వీనర్, కో కన్వీనర్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.



అతిథులకు మెమొంటోలు అందజేస్తున్న లా వర్సిటీ విసి ఆచార్య సూర్యప్రకాష్


రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంపిపి సూరిబాబు

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి- అనకాపల్లి

అనకాపల్లి మండలం కొత్తూరు నుంచి కూండ్రం మీదుగా బంగారు మెట్ట వెళ్లే రోడ్డును 32 కోట్ల రూపాయలతో మంత్రి గుడివాడ అమర్నాథ్ ప్రారంభించారని, దీనివల్ల 12 గ్రామాల ప్రజలు లబ్ధి పొందనున్నారని మండల పరిషత్ అధ్యక్షులు గొర్లి సూరిబాబు తెలిపారు. సోమవారం రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డుకు ఇరువైపులా ఏడు అడుగుల మేర విస్తరించడంతో రోడ్డు సౌకర్యంగా ఉంటుందన్నారు. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే పలు గ్రామాల్లో నిర్మించనున్న జగనన్న కాలనీలకు రోడ్డు సౌకర్యం ఏర్పడుతుందని చెప్పారు. ఎంపిపి వెంట ఇన్‌ఛార్జి ఎంపీడీవో కే ధర్మారావు, ఆర్ అండ్ బి ఏఈ, వేట జంగాలపల్లి గ్రామ సర్పంచ్ గూన నూకరాజు, ఎంపీటీసీ సభ్యులు మొల్లేటి హైమా శివాజీ, వైసిపి నాయకులు ఉన్నారు.

సైన్స్ ఎగ్జిబిషన్‌ను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

స్థానిక జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో ఈ నెల 22, 23 తేదీల్లో నిర్వహించే జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌ను విజయవంతం చేసేందుకు ఉపాధ్యాయ వర్గాలు, సిబ్బంది కృషి చేయాలని ఏడి రవిబాబు సూచించారు. జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో సోమవారం జిల్లాస్థాయి ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందులో పాల్గొనే పాఠశాలలు 22వ తేదీ ఉదయం ఏడు గంటలకు తమ పాఠశాల పేరు, ప్రాజెక్టు పేరు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. అనంతరం తమకు కేటాయించిన గదిలోకి ప్రాజెక్టు విద్యార్థితో పాటు ఒక గైడ్ టీచర్‌ను అనుమతించడం జరుగుతుందని చెప్పారు. జిల్లాలో ప్రప్రథమంగా జరిగే ఈ సైన్స్ ఫెయిర్‌ను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఈవో వెంకట లక్ష్మమ్మ, డిప్యూటీ డిఈఓ ప్రేమ్ కుమార్, డిస్ట్రిక్ట్ సైన్స్ ఆఫీసర్ కప్పల ప్రసాద్, ఏపీవో వెంకటేశ్వరరావు, ఏఎస్ఓ ఎం.సత్య ప్రసాద్, అనకాపల్లి, కసింకోట ఎంఈఓలు దివాకర్, చిట్టిబాబు, ప్రధానోపాధ్యాయులు బ్రహ్మాజీ, పలు పాఠశాలల పిఈటిలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో బిసిలకు పెద్దపీట

- ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

ప్రజాశక్తి-దేవరాపల్లి

ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో బీసీలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పెద్దపీట వేశారని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు అన్నారు. సోమవారం దేవరాపల్లిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీల పక్షపాతిగా సీఎం జగన్ మరో మారు నిరూపించుకున్నారని హర్షం వ్యక్తం చేశారు. ప్రాంతాలవారీగా సామాజిక న్యాయాన్ని పాటించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో జెడ్పిటిసి కర్రి సత్యం, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ సింహాచలం నాయుడు, వైసిపి మండల అధ్యక్షులు బూరె బాబురావు, నాయకులు కర్రి సూరి నాయుడు, గూడుపు రాము, రెడ్డి బలరాం, ఉగ్రోకుల అప్పారావు, కోలా వెంకటరమణ, దాసరి సంతోష్, కాటిపాము పెదనాయుడు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం బూడి

స్టీల్‌ప్లాంట్ జోలికొస్తే ఊరుకోం


దీక్షల్లో కూర్చున్న స్టీల్‌ప్లాంట్ సిఐటియు విభాగం కార్మికులు

ప్రజాశక్తి-ఉక్కునగరం (విశాఖపట్నం)

రాష్ట్రాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తూ వందలాది మందికి ఉపాధి కల్పిస్తున్న వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటుపరం చేయాలని చూస్తే ఊరుకునేది లేదని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్ డి.ఆదినారాయణ, నాయకులు వి.శ్రీనివాసరావు, ఎన్.రామారావు, విల్లా రామ్మోహన్ కుమార్, సిహెచ్.సన్యాసిరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 739వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్ సిఐటియు కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశ సంపదను అదానీ, అంబానీలకు కట్టబెడుతున్న బిజెపి ప్రభుత్వం దేశాన్ని పాలించే నైతిక హక్కును కోల్పోయిందని అన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తే ఆ పార్టీకి ఇవే చివరి ఎన్నికలవుతాయని తెలిపారు. స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీర్యం చేసేందుకు కేంద్రం పన్నుతున్న కుట్రలను పోరాటాలతో తిప్పికొడతామన్నారు. కార్మికుల ఉద్యమాన్ని చూసైనా ప్రయివేటీకరణ నిర్ణయం నుంచి వెనక్కు తగ్గాలని, ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. దీక్షల్లో జ్యోతిప్రసాద్, ఎల్లవు మురళీ ప్రసాద్, గబ్బర్, సూర్య, ఉమ్మడిశెట్టి భాస్కర్ పాల్గొన్నారు.


క్రీడాకారులతో నిర్వాహకులు

గ్రామస్థాయిలో క్రీడలను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం

గ్రామ స్థాయిలో క్రీడలను ప్రోత్సహించాలని మార్టూరు గ్రామ నూకాంబిక ఆలయ ఉత్సవ కమిటీ సెక్రటరీ కెవి రమణ అన్నారు. గ్రామంలో నూకాంబిక అమ్మవారి పండగ సందర్భంగా గ్రామ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కెవిఆర్ బ్యాచ్ ఆర్థిక సహాయంతో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు సోమవారం మూడవరోజు కొనసాగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫుట్ట నారాయణరావు, గుర్రం నాగేశ్వరరావు, కాకి సన్యాసి పైడిరాజుల జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సోమవారం ఎర్రవరం, దార భోగాపురం, వెంకటాపురం, నక్కపాలెం, పూడిమడక గ్రామాలకు చెందిన క్రికెట్ జట్లు ఆడారు. మూడవరోజు పోటీలు రసవత్తరంగా సాగాయి. క్రీడాకారులను కెవి రమణ, వానపల్లి సూరిబాబు, కే చందు, గుర్రం చిరంజీవి, జి వెంకటేష్, సన్యాసి నాయుడు తదితరులు పరిచయం చేసుకున్నారు.

ఇంటి స్థలం మంజూరుకు వినతి

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

ఇంటి స్థలం మంజూరు చేయాలని కోరుతూ మండలంలోని మల్లం గ్రామానికి చెందిన నమ్మి సత్యవతి అనే మహిళ జిల్లా కలెక్టర్‌కు స్పందనలో సోమవారం వినతిపత్రం అందజేశారు. గతంలో తన ఆధీనంలో నివాసం ఉన్న స్థలాన్ని గ్రామపంచాయతీ కార్యాలయ నిర్మాణానికి తీసుకున్నారని, తదుపరి వేరే చోట నివాసయోగ్యమైన స్థలాన్ని ఇచ్చే వరకు పాత పంచాయతీ కార్యాలయంలో నివాసం ఉండమని గ్రామ పెద్దలు చెప్పారని ఆమె తెలిపారు. ఇప్పుడు పాత పంచాయతీ కార్యాలయంలో కూడా తమను ఖాళీ చేయమని చెబుతున్నారని, తమకు ఎక్కడికి పోవాలో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబమంతా రోడ్డున పడ్డామని, జిల్లా అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.


పిల్లలతో కలెక్టరేట్‌కు వచ్చిన బాధిత కుటుంబం



సమావేశంలో పాల్గొన్న ఎంపిపి, జెడ్‌పిటిసి, అధికారులు

సాదాసీదాగా మండల పరిషత్తు సమావేశం

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం సోమవారం సాదాసీదాగా జరిగింది. ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మండలంలోని 27 గ్రామ పంచాయతీల సర్పంచులు, ఎంపిటీసీలు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నిబంధనలకు లోబడి ఈ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జెడ్పిటిసి కర్రి సత్యం, వైస్ ఎంపీపీలు, ఎంపీడీవో సిహెచ్ సుబ్బలక్ష్మి, తహశీల్దార్ ఎం.లక్ష్మి పాల్గొన్నారు.

శ్రీకనకమహాలక్ష్మి హుండీ ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : పాత నగరంలోని బురుజుపేటలో ప్రసిద్ధి చెందిన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి హుండీని సోమవారం లెక్కించారు. జనవరి 7 నుంచి ఈ నెల 20 వరకూ 44 రోజులకుగాను హుండీ ద్వారా రూ.37 లక్షల 55 వేల 455, అన్నదానం హుండీ ద్వారా రూ.34 వేల 169 వెరసి రూ.37 లక్షల 89 వేల 624 ఆదాయం లభించిందని దేవస్థానం కార్యనిర్వహణ అధికారి కె.శిరీష మీడియాకు తెలిపారు. బంగారం 95 గ్రాములు 400 మిల్లీ గ్రాములు, వెండి 749 గ్రాములు వచ్చాయన్నారు. ఇవి కాకుండా అమెరికా, ఒమెన్, కువైట్, సింగపూర్ దేశాల కరెన్సీ కూడా లభించిందన్నారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో దేవస్థానం పాలకమండలి ఛైర్‌పర్సన్ సింహాచలం, ధర్మకర్తల మండలి సభ్యులు బోదిలపాటి సత్య రూపవాణి, ఎస్.సతీష్, ఎన్ఎస్ఎస్.సుబ్రహ్మణ్యం, సహాయ కార్యనిర్వహణ అధికారి వి.రాంబాబు పాల్గొన్నారు.

దళిత యువకున్ని హత్య చేసిన వారిని శిక్షించాలి

ప్రజాశక్తి-వడ్డాది : విజయనగరం జిల్లా రాజాంలో దళిత యువకుడిని హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని రెల్లి మహిళా హక్కుల సాధన కమిటీ బుచ్చయ్యపేట మండల అధ్యక్షురాలు ముత్యాల త్రివేణి డిమాండ్ చేశారు. సోమవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ దళితులపై దాడులను అరికట్టలేకున్నారు రాజాం గ్రామంలో దళిత యువకుడైన దేవపల్లి వెంకటేష్‌ను అతి కిరాతంగా హత్య చేసి హతమార్చిన హంతకులను ఉరి తీయాలన్నారు. చట్టాలు సక్రంగా అమలు కాకపోవడం వల్లనే దళితులపై దాడులు అధికమవుతున్నాయని తెలిపారు. దేవపల్లి వెంకటేష్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని, వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని, ఆ కుటుంబానికి 5 ఎకరాల భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహిళలు పార్వతి, అప్పలనరస, సింహాచలం పాల్గొన్నారు.

ముగిసిన శివరాత్రి ఉత్సవాలు


తీరంలో భక్తుల రద్దీ

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని రాజయ్యపేట, బోయపాడు సముద్రతీరంలో సోమవారం భక్తులు మహాశివరాత్రిని పురస్కరించుకుని పుణ్య స్నానాలు ఆచరించారు. భక్తుల రద్దీతో తీర ప్రాంతం కిటకిటలాడింది. మండలంలోని పలు గ్రామాల నుంచి పెద్దలు, పిల్లలు స్నానాలు ఆచరించేందుకు సముద్ర తీరానికి చేరుకోవడంతో జనసంద్రంగా దర్శనమిచ్చింది. రాజయ్యపేట, బోయపాడు తీరాల్లో వేలాది మంది భక్తులు స్నానాలు ఆచరించారు. ఎటుచూసినా జన సందోహమే కనిపించింది. నక్కపల్లి నుంచి రాజయ్యపేట వరకు వాహనాలు రద్దీ కనిపించింది.

ఘనంగా నూకతాత జాతర

నక్కపల్లి:మండలంలోని మత్స్యకార గ్రామమైన రాజయ్యపేట గ్రామంలో సోమవారం నూకతాత జాతరను మత్స్యకారులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మత్స్యకారులు కులదైవం నూకతాత పండుగను మత్స్యకారులు మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం ఆనవాయితీ. ముందుగా నూకతాత ఘటాలను సముద్రంలో స్నానాలు చేయించారు. సాంప్రదాయం, ఆచారం మేరకు దేవుడి రూపంగా భావించే పూజారులు భక్తులపై నడిచివెళ్లారు.ఎమ్మెల్యే గొల్ల బాబూరావు నూకతాత ఘటాలను మోసారు. పండుగ సందర్భంగా గ్రామంలో భారీ విద్యుద్దీకరణ ఏర్పాటు చేశారు.

కాంతారా ట్రూప్ సందడి

గొలుగొండ: మండలంలోని కొత్తమల్లంపేట గ్రామంలో జానికిలమ్మ తల్లి ఉత్సవాల సందర్భంగా గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కాంతార ట్రూప్ పలువురిని ఆకట్టుకుంది. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మహాశివరాత్రి పురస్కరించుకొని మూడు రోజుల పాటు అమ్మవారి ఉత్సవాలు ఘనంగా జరుగుతాయి. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దారమఠం వద్ద భక్తుల కోలాహలం

గొలుగొండ:మహాశివరాత్రి సందర్భంగా మూడో రోజు సోమవారం దారమఠం ఉమా దారమల్లేశ్వరస్వామి ఆలయం వద్ద భక్తుల కోలాహలం నెలకొంది. ఉదయం నుంచి భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. ఎస్సై నారాయణరావు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. మండలంలోని ఏఎల్‌పురం గ్రామంలో నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

భక్తులకు మజ్జిగ పంపిణీ

గొలుగొండ:మండలంలోని ఏఎల్ పురంలో నీలకంఠేశ్వరస్వామి ఆలయం వద్ద ఎల్ఎన్ఎం నాయుడు ఒకేషనల్ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ లగుడు హరిప్రసాద్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఎస్.అప్పలరాజు, కళాశాల ప్రిన్సిపాల్ కెవిఎస్‌డి.మూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తకోట:మహా శివరాత్రి సందర్భంగా రావికమతం మండలం కల్యాణపులోవ తిరునాళ్ళు సోమవారం మూడవ రోజు ముగిసాయి. 18,19, 20 వ తేదీలలో జరిగిన ఈ తిరునాళ్లలో తొలి రోజు సుమారు 70 వేలకు పైగా భక్తులు, రెండవ రోజు ఆదివారం లక్షకు పైగానూ, మూడవ రోజు సోమవారం కుడా అధిక సంఖ్యలో భక్తులు హాజరైనట్టు దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. ఎటువంటి సంఘటనలు చోటు చేసుకోకుండా కొత్తకోట సర్కిల్ పోలీసులు చర్యలు చేపట్టగా, నర్సీపట్నం ఆర్‌టిసి డిపో సుమారు 50 పైగా బస్సు సర్వీస్‌లను నడిపారన్నారు.కల్యాణపు లోవ తిరునాళ్ళకు సుమారు రూ. 14 లక్షల 60 వేల 102ల ఆదాయం లభించినట్టు దేవాదాయ ధర్మ దయా శాఖ ఈవో మురళికృష్ణ తెలిపారు. గత ఏడాది రూ.15 లక్షల 77 వేల 240 ఆదాయం లభించింది.


కల్యాణపులోవలో నగదు లెక్కిస్తున్న నిర్వాహకులు

స్పందన సమస్యలు సత్వర పరిష్కారం

- ఆర్‌డిఒ జయరాం

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:స్పందనలో వచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కారం చేసేందుకు కృషి చేస్తున్నామని ఆర్డీఓ జయరాం తెలిపారు. నర్సీపట్నం సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం ఆర్డీవో జయరాం ఆధ్వర్యంలో నిర్వహించారు. డివిజన్ పరిధిలో ప్రజలు తమ సమస్యలను పరిష్కారం చేయాలంటూ వినతులు వచ్చాయి దీంతో స్పందించిన ఆర్డీవో మాట్లాడుతూ, భూ సమస్యలపై ఫిర్యాదులు పెరుగుతున్నాయని, న్యాయబద్ధంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కారం చేయాలని సంబంధిత తహశీల్దారులకు సూచించారు. భార్యాభర్తల మధ్య, కుటుంబాల మధ్య తగాదాలతో భూమి సమస్యలు ఎక్కువగా వస్తున్నాయని, సామరస్యంగా పరిష్కారం చేసుకోవాలని ఫిర్యాదుదారులకు సూచించారు. జగనన్న ఇళ్ల నిర్మాణానికి సంబంధించి లబ్ధిదారులను సన్నద్ధం చేసి ఇల్లులు నిర్మించేలాగా ప్రోత్సహించాలని తెలిపారు. రేషన్ కార్డులు, పింఛన్లు, గృహాలు, సరిహద్దు తగాదాలు వికలాంగుల సదరం సర్టిఫికెట్లు, హాస్టల్ సీట్లు వంటి సమస్యలపై స్పందనలో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కారం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న అధికారులు

కెజిబివిని పరిశీలించిన అధికారులు

ప్రజాశక్తి-నక్కపల్లి:జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని సోమవారం ఎంపీడీవో సీతారామరాజు, ఎంఈఓ డివిడి ప్రసాద్ తనిఖీ చేశారు. విద్యాలయంలో మౌలిక వసతులు, టాయిలెట్, డ్రింకింగ్, రన్నింగ్ వాటర్, భోజన పథకాన్ని, రికార్డులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. రక్షణ గోడను మరింత ఎత్తుగా నిర్మించాలని కోరారు. నివేదికను జిల్లా కలెక్టర్ కు అందజేస్తామని ఎంపీడీవో సీతారామరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యాలయం ప్రత్యేక అధికారిణి త్రివేణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


బహుమతి అందజేస్తున్న నాయకులు

విజేతలకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని రాజయ్యపేట గ్రామం లో నూకతాత జాతర సందర్భంగా చిరునవ్వు క్రికెట్ టోర్నమెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ పోటీల్లో విజేతకు ఆదివారం రాత్రి బహుమతి అందజేసారు. క్రికెట్ టోర్నమెంట్లో 50 క్రికెట్ టీములు పాల్గొన్నాయి. ఫైనల్ కు కొత్తపేట, రేవు పోలవరం టీమ్‌లు తలపడ్డాయి. కొత్తపేట క్రికెట్ విన్నర్ గాను, రేవు పోలవరం రన్నర్ గా గెలుపొందాయి. జనసేన రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివదత్, నాయకులు పిక్కి రాంబాబు, చిరు నవ్వు అసోసియేషన్ సభ్యుల చేతుల మీదగా రేవు పోలవరం రన్నర్ టీమ్ కెప్టెన్ చెల్లూరి మాధవరావుకు బహుమతి అందజేసారు.


విరాళం ఇస్తున్న పైలా

ఆలయానికి రూ.10 వేల విరాళం

ప్రజాశక్తి- చీడికాడ: మండలంలోని బి.సింగవరం గ్రామంలో దుర్గాలమ్మ అమ్మవారి ఆలయం పునర్నిర్మాణానికి మాడుగుల నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పైలా ప్రసాదరావు రూ.10 వేలను విరాళంగా అందజేశారు. టిడిపి నాయకులు శరగడం శివ, శరగడం సత్తిబాబు, దాడి రాములునాయుడు, శరగడం సత్తిరాజు, శరగడం విశ్వనాథం, శరగడం దుర్గినాయుడు, రాపేటి తరుణ్, దాడి రాము తదితరులు ప్రసాదరావును కలిసి గ్రామంలో నిర్మిస్తున్న దుర్గాలమ్మ పునర్నిర్మాణంపై చెప్పారు. స్పందించిన ప్రసాదరావు పది వేలను విరాళంగా వారికి అందజేశారు.

పింఛన్లు అన్యాయంగా తొలగిస్తే.. న్యాయ స్థానాలకు వెళ్తాం

మాజీ మంత్రి అయ్యన్న

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: అన్యాయంగా పింఛన్లు తొలగిస్తే న్యాయస్థానాలను ఆశ్రయించాల్సి వస్తుందని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్న పాత్రుడు తెలిపారు. సోమవారం ఆయన మీడియాకు ఒక వీడియోను విడుదల చేశారు. వైసిపి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి మీటింగ్‌లకు రాకపోతే పింఛన్లు రద్దు చేస్తామని వాలంటీర్లతో బెదిరింపులకు గురి చేస్తుంని విమర్శించారు. టీడీపీ నేతల పింఛన్లు, మరికొన్ని పథకాలు తీసేశారన్నారు. ఈ విషయంపై ముందుగా ఎంపిడిఒ, ఆర్డీవోకు వినతులు అందజేసినా ఫలితం లేకపోయిందన్నారు.ఈ విషయమై హైకోర్టులో కేసు వేయడం జరిగిందన్నారు. దీంతో హైకోర్టులో వీరందరికి న్యాయం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దౌర్జన్యం చేసినా న్యాయ స్థానంలో న్యాయం జరుగుతుందన్నారు. కోర్టులో పిటిషన్ పెట్టిన వారందరికి వెంటనే పాత బకాయిలతో పాటు పింఛన్ చెల్లించాలని తీర్పు ఇచ్చిందన్నారు. ఈ విధంగా మాకవరపాలెం మండలంలో 4, నాతవరం మండలంలో 11, గొలుగొండ మండలంలో కొంత మందికి పింఛన్లు వచ్చాయని గుర్తు చేశారు. వీరందరికి పాత బకాయిలతో పింఛన్లు అందజేసారన్నారు. ఎవరో భయపిస్తే భయపడాల్సిన అవసరం లేదన్నారు. త్వరలో ఇంటింటికి జగన్ స్టిక్కర్లు అంటించనున్నారని,. వీటిని అంటించకుంటే పథకాలు నిలిపి వేస్తారని బెదిరిస్తారని, ఎవరూ భయపడవద్దని సూచించారు.

పార్టీ బలోపేతానికే గృహ సారథులు

ఎమ్మెల్యే బాబూరావు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాబూరావు

ప్రజాశక్తి-కోటవురట్ల:రానున్న ఎన్నికల్లో పార్టీ బలోపేతానికి గ్రామ కన్వీనర్లు, గృహసారథులు కీలక పాత్ర పోషించాలని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు కోరారు. మండల కేంద్రంలో స్థానిక జూనియర్ కళాశాల ఎదురుగా ప్రైవేట్ లేఅవుట్లో గ్రామ కన్వీనర్లు, గృహ సారథుల సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2024లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో గెలుపొందేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గురుతర బాధ్యత అప్పగించారని, దీన్ని గుర్తించాలన్నారు. కన్వీనర్లు, సారథులకు ఇన్సూరెన్స్ స్కీమ్ కూడా కల్పించనున్నామన్నారు. సంక్షేమ పథకాలు సక్రమంగా అందేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి సభ్యురాలు ఉమాదేవి, మండల ఉపాధ్యక్షులు దత్తుడు రాజు, వైసిపి మండల అధ్యక్షులు కిల్లాడ శ్రీనివాసరావు, బీసీ సెల్ అధ్యక్షులు పైల రమేష్, స్థానిక సర్పంచ్ అనిల్ కుమార్, ఎంపీటీసీ సభ్యులు రాము, వైసిపి సీనియర్ నాయకులు సిద్ద బత్తులసత్యనారాయణ, ఎంపిటిసిలు, గ్రామ సర్పంచులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు,

ఎయిడ్స్‌పై అవగాహన

ప్రజాశక్తి-చీడికాడ: ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు చైల్డ్ ఫండ్ ఇండియా లింకు వర్కర్స్ స్కీం ఆధ్వర్యంలో చీడికాడ గ్రామంలో గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఎయిడ్స్ జిల్లా రిసోర్స్ పర్సన్ ఎస్ గోవిందరావు ఆధ్వర్యంలో ఎయిడ్స్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ, సుఖ వ్యాధులు, టిబి వంటి వ్యాధుల పట్ల అవగాహన కల్పించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గాలి సామాలమ్మ, అంగన్వాడీ సిబ్బంది, చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీం సిబ్బంది ఎం.రత్న కుమారి, ఎస్.చందు, వాలంటీర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గోవిందరావు

రూ.20 వేల వితరణ


నగదు ఇస్తున్న నేతలు

ప్రజాశక్తి-ఎస్.రాయవరం: మండలంలో కొరుప్రోలు గ్రామంలో ఇటీవల హత్యకు గురైన దంటు ప్రవీణ్ కుటుంబ సభ్యులను కాపు సంక్షేమ సేన నాయకులు పరామర్శించి సోమవారం రూ.20 వేలను అందజేశారు. కుటుంబ సభ్యులను పరామర్శించిన వారిలో కాపు సంక్షేమ సేన మహిళా వర్కింగ్ స్టేట్ ప్రెసిడెంట్ కరణం కళావతి, అనకాపల్లి జిల్లా కాపు సంక్షేమ సేన ఉపాధ్యక్షుడు రామకోటేశ్వరరావు, నర్సీపట్నం నియోజకవర్గ కాపు సంక్షేమ సేన ఇంచార్జ్ పూడి చక్రవర్తి, కాపు సంక్షేమ సేన మహిళా విభాగం జాయింట్ సెక్రటరీ కొలగని మహాలక్ష్మి, కాపు సంఘం నాయకులు చిరంజీవి, తుంపాల రాంబాబులు ఉన్నారు.

యోగాతో ఆరోగ్యం

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ :మానవుడు తనలో ఉన్న అతీతమైన శక్తిని తన కోసం వినియోగంలోకి తీసుకు రావడమే యోగా ముఖ్య ఉద్దేశమని, సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని యోగా గురువు ఉపేంద్ర సాయి అన్నారు. స్థానిక నలంద ఇంగ్లీష్ మీడియం స్కూల్లో వ్యక్తిత్వ వికాస కేంద్రం రెండవ బ్యాచ్ శిక్షణా తరగతులు ప్రారంభించారు. ఇది సాధారణ యోగ శిక్షణ కాదని, కరోనా తర్వాత అనేక ప్రత్యేకతలతో రూపొందించామన్నారు. కరోనా తర్వాత రోగ నిరోధక శక్తి తగ్గి, ఊపిరితిత్తులు, గుండె బలహీనమవడం, మానసిక ఒత్తిడి, నీరసం తదితర లక్షణాలు అనేక మందిలో కనిపిస్తున్నాయన్నారు. అవయవాలు ఆరోగ్యంగా ఉంటాయని తెలిపారు.


యోగా చేస్తున్న స్థానికులు

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభను గెలిపించండి

పలు చోట్ల ప్రజా సంఘాల నేతల ప్రచారం



అచ్యుతాపురం మండలంలో ప్రచారంలో పాల్గొన్న నేతలు

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభను గెలిపించాలని కోరుతూ ప్రజాసంఘాల నేతలు సోమవారం ప్రచారం చేపట్టారు. విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి కరపత్రాలు పంపిణీ చేశారు.

ప్రజాశక్తి- యంత్రాంగం

పెందుర్తి : పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభను గెలిపించాలని కోరుతూ జివిఎంసి 93, 94 వార్డుల పరిధిలోని పలు సచివాలయాలలో ప్రజా సంఘాల నాయకులు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు జగన్ మాట్లాడుతూ, శాసనమండలిలో నిరుద్యోగులు గొంతు వినిపించేది పిడిఎఫ్ నాయకులేనన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జోన్ కార్యదర్శి బి.రమణి, జన విజ్ఞాన వేదిక నాయకులు పాల్గొన్నారు.

మధురవాడ : పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ, కొమ్మాది, కార్పెంటర్ కాలనీ, వికలాంగుల కాలనీ, రాజీవ్‌గృహకల్ప, స్వయంకృషినగర్ ప్రాంతాల్లో సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు డి.అప్పలరాజు, మాట్లాడుతూ, మార్చి 13వ తేదీన జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో డాక్టర్ రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం నాయకులు డి.కొండమ్మ, సిహెచ్ శేషు, ఎస్.రామప్పడు. డివైఎఫ్ఐ నాయకులు వై.రాము, కెవిపిఎస్ నాయకులు జికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

గాజువాక : శ్రీనగర్, అరుణోదయ కాలనీ, సుందరయ్య కాలనీలో ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అనిత, సిఐటియు నాయకులు రాంబాబు, కృష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

భీమునిపట్నం : ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ సిఐటియు నాయకులు సోమవారం తగరపువలసలో ప్రచారం నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో ఉన్న పట్టభద్రులను, ఉపాధ్యాయులను కలిసి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు రవ్వ నరసింగరావు, ఎస్ శ్రీనివాసవర్మ, సోమి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీగా పిడిఎఫ్, 250 ప్రజా సంఘాలు బలపర్చిన అభ్యర్థి కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని సోమవారం కొండకర్ల గ్రామంలో ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా పట్టబద్రులను కలిశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము బుద్ధ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

హరిపాలెంలో ప్రచారం

కోరెడ్ల రమాప్రభకు మద్దతుగా సోమవారం సాయంత్రం ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా కన్వీనర్ కె రామ సదాశివరావు, జన విజ్ఞాన వేదిక జిల్లా కన్వీనర్ ఎం సూర్య రామకుమార్, ప్రజానాట్యమండలి జిల్లా ప్రతినిధి ఎస్ కనుమ నాయుడు తదితరులు మండలంలోని హరిపాలెం గ్రామంలో విస్తృతంగా ప్రచారం చేశారు.



గాజువాకలో..



డుంబ్రిగుడలో..

డుంబ్రిగూడ : ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ మండలంలోని అరకు సంత బయలు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో గిరిజన సంఘం నాయకులు సోమవారం కరపత్రాలను పంచుతూ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఓటు హక్కు ఉన్న ఉపాధ్యాయులు, ఇతర పట్టభద్రులను కలిసి, రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు.

ఈ సందర్భంగా గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు టి సూర్యనారాయణ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధి, మెరుగైన విద్య, వైద్యం, ఉపాధి, ఉద్యోగావకాశాలు, ఉద్యోగ ఉపాధ్యాయ, కార్మికులు, పెన్షనర్లు ఇలా అన్ని వర్గాల సమస్యల పరిష్కారానికి చట్టసభల్లో ఈ ప్రాంత ప్రజల వాణిని వినిపించాలంటే, సమస్యలపై అవగాహన, పోరాటతత్వం ఉన్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభ వంటి వారిని గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యావంతులైన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఓటర్లంతా విజ్ఞతతో రమాప్రభకు ఓటేసి గెలిపించాలని కోరారు. నిరుద్యోగులు, మేధావులు, 250కుపైగా ప్రజాసంఘాలు బలపర్చిన అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాపభను భారీ మెజార్టీతో గెలిపించాల్సిన అవసరం అందరిపై ఉందని ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో గిరిజన సంఘం నాయకులు ,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఆందోళన చేపడుతున్న లారీ ఓనర్స్

లారీ యజమానుల నిరసన

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: స్థానిక లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్డిఓ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఆర్డిఓ జయరాంకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా లారీ ఓనర్స్ మాట్లాడుతూ, ప్రభుత్వ నిబంధనల మేరకే ఇసుక రీచ్ ల నుండి ఇసుకను తరలించి అమ్ముకుంటున్నామన్నారు. ఈనెల 16న స్థానిక రూరల్ ఎస్సై లారీలను స్టేషన్లోకి తరలించి, ఐదు రోజులుగా వాహనాలను ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆర్డీవోకు ఫిర్యాదు చేశామన్నారు. పోలీస్ స్టేషన్, రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నా తమకు న్యాయం చేయలేదని ఆవేదన వ్యక్తం చేసారు. తమపై ఏమైనా తప్పులు ఉంటే శిక్ష విధించి చర్యలు తీసుకోవాలని, వాహనాలను స్టేషన్ లో ఉంచడం సరికాదన్నారు. రోజులు తరబడి ఉంచడంతో ఇంజిన్, బ్యాటరీ వంటి పరికరాలు పాడయ్యే అవకాశం ఉందని, దీంతో ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతామని తెలిపారు.



విచారణ చేపడుతున్న అధికారులు

విజిలెన్స్ అధికారుల తనిఖీ

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్ : స్థానిక ఫాస్ట్ రేంజ్ కార్యాలయంలో రాష్ట్ర ఫారెస్ట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. రాష్ట్ర విజిలెన్స్ డిఎఫ్ఓ ఎం.రవిశంకర్ శర్మ తనిఖీలు నిర్వహించి ఈ సందర్భంగా మీడియా తో మాట్లాడారు. గతంలో పని చేసిన రేంజ్ అధికారి బొత్స అప్పలరాజుపై ప్రభాకర్ రెడ్డి ఫిర్యాదు చేయడంతో అధికారులను, బీట్ ఆఫీసర్లను విచారణ చేస్తున్నామని తెలిపారు. వేములపూడి సామిల్లుకు అనధికారికంగా కొన్ని చెట్లు తరలించినట్లు ఫిర్యాదులో పేర్కొనడంపై విచారణ చేస్తున్నామని తెలిపారు. ఇక్కడ పని చేసిన శిక్షణ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లను విచారణ చేసి నిజానిజాలు నిర్ధారణ అయితే తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఫిర్యాదు చేసినటువంటి ప్రభాకర్ రెడ్డి అనే వ్యక్తి తమకు ఇంకా అందుబాటులోకి రాలేదన్నారు.



బస్‌లో విద్యార్థులను తరలిస్తున్న అధికారులు

మౌలిక వసతులు లేనందున

విద్యార్థుల తరలింపు

ప్రజాశక్తి-ఎస్.రాయవరం: మండలంలోని లింగరాజు పాలెం గ్రామంలో మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో మౌలిక వసతులు లేనందున పదో తరగతి విద్యార్థులను తరలించినట్లు అధికారులు తెలిపారు. సోమవారం ఉదయం సుమారు 24 మంది విద్యార్థినులను తానాం గురుకుల పాఠశాలకు తరలించినట్లు పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అధికారులు తల్లిదండ్రులతో చర్చించి పంపించారు.విద్యాలయంలో పదవ తరగతి విద్యార్థినుల పట్ల అధికారులు స్పందించినప్పటికీ మిగిలిన విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని అధికారులను తల్లిదండ్రులు కోరారు.

ఎయు విసి, ఆర్‌జెడిలపై చర్యలు తీసుకోవాలి

ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్ డిమాండ్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : అధికార పార్టీ బలపరిచిన ఎమ్మెల్సీల గెలుపే లక్ష్యంగా అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న ఆంధ్ర యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ పివిజిడి ప్రసాద్ రెడ్డి, ఆర్‌జెడి ప్రతాప్ రెడ్డిలను విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్‌జె.నాయుడు, ఎఐఎస్ఎఫ్ నాయకులు జి.ఫణీంద్ర కుమార్, యు.నాగరాజు మాట్లాడుతూ పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా అధికార పార్టీ ఎమ్మెల్సీలు గెలుపే లక్ష్యంగా ఆర్‌జెడి ప్రతాప్‌రెడ్డి స్వయంగా మీటింగ్ పెట్టి డిఇఒ, ఎంఇఒ, హెచ్ఎంలను ప్రచారంలో భాగస్వాములు కావాలని ఒత్తిడి తీసుకురావడం దారుణమన్నారు. అలాగే అనేకసార్లు ఆంధ్ర యూనివర్సిటీ విసి అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నా ఆయనపై ఇంతవరకు ఎటువంటి చర్యలూ తీసుకోకపోవడం శోచనీయమన్నారు. అధికార పార్టీ అండదండలతో ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించి తాజాగా దసపల్లా హోటల్‌లో డిగ్రీ కళాశాలల యాజమాన్యాలతో విసి ప్రసాద్ రెడ్డి సమావేశం నిర్వహించారన్నారు. అందులో ఎయు ఉన్నతాధికారి కృష్ణమోహన్ కూడా పాల్గొన్నారని తెలిపారు. వారిని తక్షణమే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు బి.గౌతమ్, ఎఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు శేఖర్, సింహ పాల్గొన్నారు.



ఆందోళన చేపడుతున్న విద్యార్థి సంఘాల నాయకులు



విచారిస్తున్న అధికారులు

స్పందన ఫిర్యాదుపై విచారణ

ప్రజాశక్తి-రోలుగుంట: మండలంలో వికలాంగుల సమాఖ్య ఆధ్వర్యంలో శ్రీనిధి నిధులు 2006 సంవత్సరంలో రూ.43లక్షల రుణం 68 గ్రూపులకు మంజూరు చేయగా ఆ నిధులను పక్కదోవ పట్టినట్లు స్పందనలో అందిన ఫిర్యాదు మేరకు అనకాపల్లి జిల్లా డిపిఎం శ్రీనివాస్ సోమవారం విచారణ చేపట్టారు. నాలుగు టీములుగా ఏర్పడి మండలంలో కొవ్వూరు, బుచ్చంపేట, జెపి.అగ్రహారం, బల్లిపాలెం గ్రామాల్లో విచారణ చేపట్టినట్లు శ్రీనివాస్ తెలిపారు. సంపూర్ణంగా విచారణ చేపట్టి పూర్తి వివరాలు విలేకర్లకు తెలియజేస్తానని ఆయన తెలిపారు.

ఒత్తిడి లేని విద్యా విధానంతో పిల్లలకు బంగారు భవిత



చర్చా వేదికలో పాల్గొన్న రాముపాయుడు

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : ఒత్తిడి లేని విద్యా విధానంతో భావి భారత పౌరులైన పిల్లలకు బంగారు భవిత దక్కుతుందని స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్ అధినేత మళ్ల రామునాయుడు అన్నారు. ఆదివారం హర్యానాలోని ఇంద్ర ధనస్సు ఆడిటోరియంలో నేషనల్ ఇండిపెండెంట్ స్కూల్ అలయన్స్ ఆధ్వర్యంలో నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ-2020పై చర్చాగోష్ఠి ఏర్పాటు చేశారు. హర్యానాలోగల డిసిఎం గ్రూప్ ఆఫ్ స్కూల్స్ అధినేత డాక్టర్ అనిరుధ్ గుప్తా సారథ్యంలో ఈ చర్చా వేదిక సాగింది. ఆంధ్రప్రదేశ్ నుంచి స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్ అధినేత మళ్ళ రామునాయుడు, గుజరాత్ నుంచి కిరణ్ సేథీ, పంజాబ్ నుంచి సాగరికా రాయ్, ఢిల్లీ నుంచి అశోక్ థాకూర్ పాల్గొన్నారు. స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్ అవలంబిస్తున్న ఒత్తిడిలేని విద్యా విధానాన్ని రామునాయుడు, వాణిశ్రీ దంపతులు తెలిపారు. తాము కనిపెట్టిన ఎడ్యు ఈజీ విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమాన్ని పూర్తిగా తిలకించిన హర్యానా రాష్ట్ర విద్యా శాఖ మంత్రి కన్వర్ పాల్ గుర్జర్ మాట్లాడుతూ త్వరలోనే పై నాలుగు స్కూళ్లను అధికారికంగా సందర్శించి ఇతర విషయాలు తెలుసుకుంటానన్నారు. స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్ పాఠశాలలో అనుసరిస్తున్న ఎడ్యు ఈజీ విధానాన్ని కొనియాడారు. ఈ సందర్భంగా రామునాయుడును ఘనంగా సన్మానించారు.

తీర్థం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-మాడుగుల: మండలంలోని కే జె పురం జంక్షన్ లో ఈనెల 24 న సంతోషి మాత తీర్థం నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ కాళ్ళ అమ్మతల్లి నాయుడు తెలిపారు. ఈసందర్భంగా సోమవారం కమిటీ సభ్యులు తారువలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు క్యాంప్ కార్యాలయానికి చేరుకుని ఆయనకు ఆహ్వానం పలికారు. తీర్థ మహొూత్సవానికి హాజరు కావాలని కోరారు. ఆయన చేతుల మీదుగా తీర్థం గోడ పత్రికను ఆవిష్కరించారు.